
శుకవాణి

కం॥ దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనఁబొందన్
దీనావన! నీకొప్పును
దీనపరాధీన! దేవదేవ మహేశా!

8–133



సంస్థాపకులు: సద్గురు

శ్రీరామకృష్ణానందస్వాములవారు

సంపుటి 12

సంచిక 8

'తుమ రక్షక కాహూ కూ డరనా'

[నాకు రక్షకుడవు - నా కేమి భయము?]

— హనుమాన్‌చాలీసా.



సంరక్షకుడు :

గండి శ్రీ వీరాంజనేయస్వామివారు

"కృష్ణాయ వాసుదేవాయ - దేవకీనందనాయ చ ।
నందగోప కుమారాయ గోవిందాయ నమోనమః॥"

శ్రీకృష్ణవాణి

(భాగవత తత్త్వ సందేశ మాసపత్రిక.)

సంపుటి 12 ★ ఆగస్టు 1997 ★ సంచిక 8

సంరక్షకులు :
శ్రీ గండి వీరాంజనేయస్వామివారు

సంస్థాపకులు :
బ్రహ్మీభూత సద్గురు శ్రీ రామకృష్ణానందగిరిస్వాములవారు

సంపాదకులు :
ఆచార్య శ్రీ శంకరానందగిరిస్వాములవారు.

మేనేజింగ్ - ఎడిటర్ :
మాతా ప్రతిభానందగిరివారు

మేనేజరు : సాధు సుబ్బరాయుడుగారు.
కార్యదర్శి : బ్రహ్మచారిణి ప్రజ్ఞానందగారు.
సహాయ కార్యదర్శి : బ్రహ్మచారి దయానందగారు.

మేనేజరు :
శ్రీ భూమానందాశ్రమం - గండిక్షేత్రం,
వీరన్నగట్టుపల్లె పోస్టు - కడపజిల్లా. 516 329.

వార్షిక చందా రు. 40-00

ఓమ్

విషయసూచిక

పంచాంగము

3	ఆదివారం	ఆశ్లేషకార్తె 12–31
5	మంగళవారం	మంగళగౌరీ వ్రతం
9	శనివారం	కల్కి జయంతి
15	శుక్రవారం	శ్రీ వరలక్ష్మీవ్రతం
15	"	స్వాతంత్ర్యదినోత్సవము
16	శనివారం	శని త్రయోదశి
17	ఆదివారం	మాఘకార్తె
18	సోమవారం	రక్షాబంధం
25	"	శ్రీ కృష్ణజయంతి
30	శనివారం	శని త్రయోదశి
31	ఆదివారం	పుబ్బకార్తె ఉ. 7–39.

ॐ

భాగవత గంగ

[శ్రీ సద్గురు ఉవాచ]

(ప్రహ్లాద చరితం)

ఆత్మీయులారా! భాగవతసుధారసిక భవ్యులారా!

ప్రస్తుతం మీరు వినేది ప్రహ్లాదచరితము. ప్రహ్లాదుడు బైట భక్తుడు; లోపల జ్ఞాని. ఆయన జ్ఞాన వైభవము బాలకులకు చెప్పిన బోధలో ప్రస్ఫుట మౌతుంది.



శుకుడు బైట జ్ఞాని; లోపల భక్తుడు. శ్రీకృష్ణలీలల్లో గోపికా ఘట్టంలో ఆయనభక్తి వెల్లివిరిసింది.

"ప్రకృతమనుసరామః" మన ప్రయాణం ప్రహ్లాద ఘట్టంలో. ఈ చోట సంస్కృత భాగవతాన్ని మించి పోతన గారు తన అనువాద కళను భక్తిపారవశ్యంతో నింపి నిరూపించారు. దానిలోని "మందారమకరంద" అనే పద్య పాదాన్ని తీసుకొని డా॥ సి. నారాయణరెడ్డిగారు ఒక మంచి గ్రంథాన్నే రచించారు. "ప్రహ్లాద చరిత్రము కంఠపాఠం చేస్తే, కవిత్వశక్తి దానిపాటికదే వస్తుందని అనుభవజ్ఞుల మాట. పోతన రత్నభండారం విశేషంగా ఈ చోటే.

సనకాదులు ఒక పర్యాయం వైకుంఠం వెళ్ళారు. సనక సనందన సనత్కుమార సనత్సుజాతులు నలుగురు బ్రహ్మమానసపుత్రులు. నివృత్తి పరాయణులు. అవ్యాహత గమనులు. 'సనత్' అనగా 'సదా' అని అర్థం. వారు సదాకుమారులు లాగానే వుంటారు. పసిపిల్లలు పరమ హంసలు ఒకటే కదా!

వైకుంఠమంటే - కుంఠితం కానిచోటు భేదబుద్ధి అచ్చట వుండదు, ఉండరాదు: శేషుడు గరుడుడు ఒక చోటనే వుంటారు - అదే వైకుంఠం. శ్రీమన్నారాయణుడు అక్కడనే నెలకొని వుంటాడు.

వైకుంఠ ద్వారపాలకులు జయ విజయులు. ఏపుణ్య ప్రభావంతోనో వారా ఉన్నతస్థానాన్ని సంపాదించారు. వస్తువును సంపాదించడం పుణ్యమే; దానిని సంరక్షించు కోడం మరింతపుణ్యం. అత్యుచ్ఛ్రయః పతన హేతుః" అనే ఆర్యోక్తి వుంది. మిద్దెమీద పరుగులంటారు కదా! అలాంటప్పుడు అతి జాగరూకతతో వుండాలి. నూరుయజ్ఞాలు చేసి దేవేంద్రపదవిని బొందిన నహుష చక్రవర్తి చివరికి యేగతి పట్టాడు? కొండచిలువై పుట్టాడు. అధికారమొక మైకం.

సనకాదులు వైకుంఠంలో ప్రవేశిస్తూంటే జయ విజయులు అటకాయించారు. ఇది సమయం కాదన్నారు. భక్తునికి భగవంతునికి మధ్య భేదం చూచారు. "తస్మిన్ తజ్జనే భేదా భావాత్" భగవంతునికి భక్తునికి భేదం లేదని నారదమహర్షుల ఉపదేశం.

భేదబుద్ధి రాక్షస స్వభావం; అభేదబుద్ధి దేవతాస్వభావం. దితికొడుకులు దైత్యులు రాక్షసులు. "దితి" అంటే ద్వైత బుద్ధి అదితి కొడుకులు ఆదిత్యులు; దేవతలు. "అదితి" అంటే అద్వైతం.

ఒక కథ మా శాంతిబాయమ్మగారు (రాజమండ్రి) తరచుగా చెబుతూంటారు. రాక్షసులు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళి మొరబెట్టుకొన్నారు. "రాక్షసులు - రాక్షసులు అంటూ అందరూ మమ్మల్ని తక్కువగా చూస్తూంటారు. దేవతలలో వుండే గొప్పేమిటి ? మాలో తప్పేమిటి ? అందరం కాశ్యపుని బిడ్డలమే కదా ?" అని ధాతతో, తాతతో అంగలార్చుకొన్నారు. మాటలతో యెందుకు? "ప్రత్యక్షసాక్ష్యంతో నిరూపిస్తా"నని ప్రజాపతి వాయిదా వేశారు. ముందు రాక్షసుల బంతి, వాళ్ళు పెద్దవాళ్ళు కదా ! పూర్వదేవతలు కదా ! "పూర్వ దేవాస్సుర ద్విషః" అని అమరకోశము.

రాక్షసులు పం క్తితీరి కూర్చొన్నారు. తీరా తినబోయే సమయం, చేతులు ముడుచుకొనేందుకు వీలుకాకుండా పితామహుడు చేతులకు కర్రలు కట్టించాడు.

కబళం చేతిలోకి తీసుకొంటారు; కాని తినేదానికి నోట్లో పెట్టుకొనేదానికి వీలుకాకపోయె. కబళాన్ని పైకి యెగరవేస్తారు రాక్షసో త్తములు నోర్లు తెరుస్తారు. కొంత నోట్లో పడ్తుంది; కొంత చిందరవందరగా క్రిందపడుతుంది. వ్యర్థం, అసహ్యం. నానారోత.

దేవతలవంతు వచ్చింది. వారికీ అదే ఏర్పాటు. కానీ వారు ఆలోచించారు. తమ కబళం ఎటూ తమనోట్లో పెట్టుకొనే వీల్లేదు కదా! వాడు యెదుటివాని నోట్లో పెట్టాడు. వాడు వీనినోట్లో పెట్టాడు. "సహనౌ భువక్తు" "పరస్పరం భావయంతః" "త్య క్తేన భుంజీథాః"

అక్కడే వేదమంత్రాలు. అక్కడే భగవద్గీత, అక్కడే ఉపనిషత్తు సాక్ష్యమిచ్చాయి.

రాక్షసులకూ దేవతలకు స్వరూపంలో, స్వభావంలో ఆకారంలో కాదు వ్యత్యాసం, ఆచారంలో వ్యత్యాసం.

"భేదబుద్ధి కల్గిన మీరు రాక్షసులై పుట్టండి" వారి పాపమే వారికి శాపమైంది. సనకుడు శాపమిచ్చాడు ఈ ఈ అలజడికి శ్రీ శ్రీమన్నారాయణుడు అరుదెంచాడు.

తన వాళ్ళుచేసిన తప్పుకు బాధ్యుడు కదా! జయ విజయులు రాక్షసులుగా మూడు జన్మలెత్తితే వారి కొరకు తానూ నాల్గు జన్మలను అంగీకరించాడు వారివి ఘోరజన్మలైతే, తనవి ఘోరతర జన్మలు

సనకుడు తలంచాడు. "నా నిమిత్తంగా కదా వీరికి రాక్షస జన్మలు, వీరి ఉద్ధారంకొరకు నేనూ వీరి వెంట జన్మిస్తాను."

మొదటిది ప్రహ్లాద జన్మ. రెండవది విభీషణ జన్మ. మూడవది జన్మతో కథే ముక్తాయింపు. ఇక పనేముంది? సరిపోయింది.

సనకుడిగా వుండి నారదునికీ గురువైనాడు. ప్రహ్లాదుడుగా వస్తూ నారదునికి శిష్యుడైనాడు.

హిరణ్యకశిపుని భార్యకు "కయోదు" అని "లీలావతి" అని రెండుపేర్లు వినవొస్తాయి.

ఆమె గర్భవతిగా వున్నప్పుడు నారదుని బోధను వినింది. భర్తగారు మందరాచలంకు తపస్సుకై వెళ్ళారు. "స్వామీ! నా భర్తగారు తిరిగి వచ్చేవరకు నేను ప్రసవం కాకుండా వరమివ్వం"డంటూ నారదునితో వరంపొందింది. నూరు వత్సరాలు గర్భస్థశిశువు నారదుని బోధను గ్రహించాడు.

అతడే ప్రశస్థ భాగవతుడు ప్రహ్లాదుడు. "ప్రహ్లాద వరదా గోవిందా - గోవిందా!"

"ప్రహ్లాదః స్మరణే"

ఆత్మీయ ప్రియబంధువులారా!
భాగవత సుధాపాన కుతూహల స్వాంతులారా! వినండి.

"తవ కథామృతం - శ్రవణమంగళం" - "స్వామీ! నీ కథామృతము నోటితో త్రాగేది కాదు; చెవులతో త్రాగేది" - అని గోపీ గీతలలో గోపికలు గానం చేశారు. నోటితో త్రాగేదైతే ఒకడు త్రాగితేనే, అది యెంగిలై పోతుంది; చెవులతో త్రాగేది కాబట్టి యెందరు త్రాగినా అది యెంగిలయ్యేది కాదు. అది ఉచ్ఛిష్టం కాదు. శిష్ట సమ్మోదం.

భగవత్తత్త్వము పరావిద్యకాని అపరావిద్యగాదు. అపరావిద్యకు విషయము అనాత్మవస్తువు. అనాత్మవస్తువును విన్న తర్వాత సంపాదించవలసిన పని మిగిలి వుంటుంది. పరావిద్య విషయము ఆత్మైమే. అది సాక్షాదపరోక్షము. వింటేచాలు. ఫలప్రాప్తి సిద్ధం. బైటనుండి తెచ్చుకో వలసిన పనేమి కాదు. కబీరుదాసుగారు అన్నారు.

"సగుణ్ కీ సేకరో - నిర్గుణ్ కో కరుజ్ఞాన్ ।
నిర్గుణ్ సగుణ్ కే పరే తహా హమారే ధ్యాన్ ॥"

"సగుణ పరమాత్మ విశ్వరూపుడు కాబట్టి సేవచెయ్. నిర్గుణ పరమాత్మ స్వస్వరూపుడు కాబట్టి తెలుసుకో. నా ఉనికి నా లక్ష్యం - నిరపేక్ష నిర్విశేష వస్తువునందు సుమా!"

"ప్రకృత మనుసరామః" - ప్రహ్లాదుని స్మరణలో మనం వున్నాం. గత వ్యాసంలో ప్రహ్లాదతత్త్వ స్మరణ

చేసుకొన్నాం. ప్రహ్లాదుడు నవవిధభక్తులకు ఆచార్యుడు. ఆయనకు ఆప్రసాదం నారదునినుండి లభించింది. నారదుడు ప్రహ్లాదునికి గురువు. వాల్మీకికి వ్యాసునికి ప్రహ్లాదునికి ధ్రువునికి గురువు నారదమహర్షి. నారదుడు భక్తి శాస్త్రానికి ఆచార్యుడు. నారద భక్తిసూత్రము భక్తి సిద్ధాంతానికి ఆధారగ్రంథము.

శ్రవణం కీర్తనం విష్ణోః - స్మరణం పాదసేవనం ।
అర్చనం వందనం దాస్యం - సఖ్యమాత్మ నివేదనం ॥

ప్రహ్లాదుడు చెప్పిన ఈ భక్తిమార్గ విధములు తొమ్మిది. భగవత్కథల శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యాభక్తి ఆత్మనివేదన భక్తి - ఈ తొమ్మిదింటినే నవవిధ భక్తులంటారు.

ఒక్కొక్క భక్తికి ఒక్కొక్క పాత్రను దృష్టాంతంగా చెప్పే పరిపాటివుంది.

"శ్రీవిష్ణోః శ్రవణా త్పరీక్షిదభవత్ః వైయాసకిః కీర్తనాత్
ప్రహ్లాదః స్మరణే తదంఘ్రిభజనే లక్ష్మీః పృథుః పూజనే
అక్రూర స్త్వభివందనే కపిపతిర్దా స్యేఽథ సఖ్యేఽర్జునః
సర్వస్వాత్మ నివేదనే బలిరభూత్ కృష్ణాప్తిరేవం విధమ్॥"

పరీక్షితుడు శ్రవణభక్తితో, శుకమహర్షి (నారదుడు) కీర్తన భక్తితో ప్రహ్లాదుడు స్మరణభక్తితో, లక్ష్మీదేవి పాద సేవనతో, పృథుచక్రవర్తి అర్చన భక్తితో, హనుమంతుడు దాస్యభక్తితో. అర్జునుడు సఖ్య భక్తితో, బలిచక్రవర్తి ఆత్మనివేదన భక్తితో లోకానికి తరుణోపాయం చూపించారు. ఆదర్శమూర్తులైనారు. దృష్టాంతరూపులైనారు.

—o—

ఓమ్

భాగవత మకరందం

(గోపికా గీతం)

శుకవాణి - సంపాదకులు

రచన - **ఆచార్య శ్రీ శంకరానందగిరిస్వాములవారు,**

పెనమలూరు - కృష్ణాజిల్లా.

(గత సంచిక 36 వ పేజి తరువాయి)

"ఆత్మానం మేనిరే స్త్రీణాం మానిన్యోఽభ్యధికం భువి"

శ్రీకృష్ణుని గోపికలు మరిచారు. మాకంటే అందమైన స్త్రీలు ఈ మూడు లోకాల్లో ఉన్నారాయని స్త్రీలను వెతుకుతూ వున్నారు. బ్రహ్మాండంలో మాకంటే భాగ్యవంతులెవరైనా ఉన్నారాయని మురిసిపోతున్నారు. లక్ష్మి సరస్వతి, అప్సరసలు, నాగకన్యలు, మునికన్యలు, రాజకుమార్తెలు, గంధర్వకన్యలు, ఒక్కరేమి సమస్త స్త్రీజాతి మాతో సమానమైనవారు కలరా? అనే దురభిమానం గోపికలకు కలిగింది.

తాసాం తత్ సౌభగమదం వీక్ష్యమానం చ కేశవః।
ప్రశమాయ ప్రసాదాయ తత్రైవాఽన్తరధీయత ॥

"కేశవః-కశ్చ అశ్చ ఈశ్చ తాన్ నయతే ప్రశాస్తి ఇతి కేశవః" బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను నియమించేవాడు కాబట్టి కేశవుడనబడతాడు.

దయామయుడైన కేశవుడు గోపికల పరిస్థితిని గమనించాడు. ఈ విఘ్నాన్ని తొలగించాలనుకున్నాడు.

భగవంతుడు ఆనందరసఘనుడు. ఆతని ఆనందంలో హెచ్చు తగ్గులుండవు. సృష్టి, స్థితి, ప్రళయాల్లోగూడ తన యానందం పెరుగదు; తరగదు.

ఒకభక్తుడు భగవంతున్ని ప్రార్థిస్తాడు. "ఓ పరమేశ్వరా! నీవు ఎల్లప్పుడు ఏకరసుడవై ఉంటావు. ఎవరైనా ఎప్పుడూ ఒకే పదార్థాన్ని తింటే దాంట్లో ఆనందం రాదు. ఏదైనా మార్పుంటే బాగుంటుంది మీ ఆనందంలో" అని.

భగవంతుడంటాడు - "భక్తోత్తమా! ప్రతిరోజు నా యానందం దొరికి నీకు విసుగొస్తే నీకు నా వియోగమగుగాక! అని అన్నాడట భగవంతుడు. అదృశ్యమయ్యాడు - భక్తుడికి ఎక్కడలేని దుఃఖం కలిగింది. ఏడ్చేది అరిచేది మొదలు పెట్టాడు. భగవంతుడు తిరిగి దర్శనమిచ్చాడు. భక్తునికి చాలా ఆనందం కలిగింది' భక్తుడంటాడు - ఈ రోజు మీ ఆనందం చాలా పెరిగిపోయింది -

ఈ ఆనందం ఎలా పెరిగింది? విరహంనుండి పెరిగింది,

"న వినా విప్రలంభేన సంయోగః పుష్టిమశ్నుతే"

"వియోగం లేకుండా సంయోగ ఆనందం పూర్తిగా లభించదు. ఊరగాయ, చట్నీ మధ్యమధ్య తీసుకున్నందున

భోజనంలో ఆనందం పెరుగుతుంది. అలాగే వియోగంతో సంయోగానందం పెరుగుతుంది.

భగవంతుడు తన యానందాన్ని వృద్ధి చేయాలనుకున్నాడు. ఆతనిఆనందం అనంతమైంది. దానికిహానివృద్ధులు లేవు. దేశంలో, కాలంలో వృద్ధిని బొందలేవు. ఆ యానందం అన్ని దేశాల్లో కాలాల్లో వుండేది. ఆనందఘనుడైనందున కూరేదికాదు. అందువలన భగవదానందం ఎలా పెరుగుతుంది? ఆనందం ఒకటే. రెండులేవు. ఆ యానందాన్ని అనుభవించేవారు అనేకమయితే అది హెచ్చు తగ్గులుగా తోస్తుంది. ఎలాగంటే గంగాప్రవాహం ఒకటే. దాంట్లో నీరుత్రాగేప్రాణులు ఎంత అధికమైతే ఆ ప్రవాహ మహాత్మ్యం, ఉపయోగం ఎక్కువవుతుంది. ఇక్కడ భగవదానందాన్ని అనుభవించేవారు గోపికలు. వారి ఆనందం పెరిగితే భగవదానందం పెరిగినట్లుంటుంది. గోపికలకు ఆనందం ఎప్పుడు పెరుగుతుంది? ఆ యానందమధ్యంలో వియోగం రావాలి. అప్పుడే పెరిగినట్లనిపిస్తుంది. అందువలన శ్రీకృష్ణపరమాత్మ వారి ఆనందాన్ని పెంచేకొరకే వారి మధ్యనుండి అంతర్ధానమై వారికి కనుపించకుండా పోయాడు. ఈ అంతర్ధానంలోగూడ ప్రేమభావం ఇమిడి వుంది - ద్వేషంతో భగవంతుడు అంతర్ధానం కాలేదు.

ఒకగదిలో ఒకమణిగాని, దీపంగాని పెట్టినామనుకొండి. అది ప్రకాశం ఇస్తున్నంతవరకు మనదృష్టి దానిపైకి

వెళ్ళదు. ఎవరైనా వాటిపైన గుడ్డగాని వస్తువుగాని కప్పినా రనుకోండి. చీకటి రాగానే మనదృష్టి దానిపైకి వెళ్లుతుంది. ఆ యావరణను తొలిగించేదానికి ప్రయత్నం జరుగుతుంది. అప్పుడు దాని(ప్రకాశం)విలువ ఏంటో మనకుగుర్తుకొస్తుంది. ఇప్పుడు చీకటిద్వారా వెలుతురు విలువ తెలిసిందా ? లేదా? అలాగే గోపికల ప్రేమను లోకంలో చాటేకొరకే అంతర్ధాన మయ్యాడు. భగవంతుని ప్రేరణతోనే జగన్మోహినీ మాయా గోపికల మనస్సులో ప్రవేశించి అభిమానాన్ని పెంచింది.

"తాసాం తత్ సౌభగమదం వీక్ష్యమానం చ కేశవః",

అందుచేత గోపికల మదగర్వాలను నశింపచేసేకొరకు వారిని ప్రసన్నం చేసేకొరకు ఈ నాటకం చూపించాడు.

అంతర్హితే భగవతి సహసైవ వ్రజాంగనాః ।
అతప్యం స్తమచక్షాణాః కరిణ్య ఇవ యూథపమ్ ॥

భగవంతుడు అంతర్ధానం కాగానే వ్రజగోపికలంతా తపించారు. ఆడ ఏనుగులు మగ ఏనుగు కొరకు ఎంత తపనతో ఉంటాయో విరహబాధ వీరినీ అలాగే తపింపచేసింది. అంతర్ధానం అనేదానికి రెండర్థాలున్నాయి - దాగి ఉండుట- లోలోన మేలుకోరుట. భగవంతుడు లోలోన గోపికల మేలుగోరేవాడు కాబట్టే అంతర్ధానమయ్యాడు. ఈ అంతర్ధానం గోపికల మద - అభిమానరూప రోగానికి చికిత్సయని భావించాలి.

ప్రస్తుతం మా మధ్యలో భగవంతుడు లేడని గోపికలు తెలిసికున్నారు. మనస్సులో ఆవేదన ప్రారంభమయింది. ఆ ఆవేదనలో మంచి చెడు రెండూ మరిచారు. వారి దృష్టి, మనస్సు, వాక్కు, చేష్టలో కేవలం కృష్ణునిరూపమే తాండవ మాడుతూవుంది. ఆవేదన పరాకాష్ఠకు చేరింది. జడచేతన దృష్టియేలేదు. కనిపించిన లతలను, పొదలను, చెట్లను శ్రీకృష్ణుడుండే చిరునామా (అడ్రసు) అడిగేది మొదలెట్టారు.

ఒక రాజుగారుండేవారు. అతను పరమాత్మనుదర్శించా లనే కుతూహలం కలవాడే. మార్గం ఎవరిని అడగాలి ? గురువుగారిని. ఆ గురువుగారు దిగంబరుడు, కౌపీనధారి, ఇంటింటికి భిక్ష తీసుకొనేవాడు గాక నామాదిరే సింహాసనం పైన కూర్చుండేవాడే కావాలని అనుకుంటుండేవాడు. ఇది సంభవమా. భగవంతుడూ కావాలి - రాజ శీవీ కావాలి. ఒకే వరలో రెండు కత్తులు ఇముడగలవా ? లేదు. అభిమానం ఉంటే భగవంతుడు, భక్తి లేదు. భగవంతు డుంటే అభిమానానికి చోటు లేదు.

హృదయంలో ప్రేమబాధ పెరిగినపుడు ప్రియతముని కలియాలనే నిజమైన ఆవేదన కలుగుతుంది - అప్పుడు తానుండేచోటు ఎవరిని అడగాలి ఎవరిని అడగ గూడదనే భావనే పోతుంది. ఎవరు చెప్పగలరు ? ఎవరు చెప్పలేరు ? అనే దృష్టిగూడ పోతుంది. కనుపించిన వారినల్లా అడుగు

తునే ఉంటారు - మేఘసందేశంలో యక్షుడు తన ప్రియు రాలికి మేఘాలద్వారా సందేశాలు పంపినట్లు కనుపిస్తుంది.

"పప్రచ్ఛురాకాశవదంతరం బహిర్వ్యాప్తేషు
సంతం పురుషం వనస్పతీన్ "

సమస్త ప్రాణులలోపల బయట ఆకాశంవలె వ్యాప్తమై యున్న ఆ పరమపురుషుని చిరునామ గోపికలు వృక్షాల నడుగుతూవున్నారు. మొదట వారు మర్రి, రావి, అశోక మొదలగు పెద్ద పెద్ద వృక్షాల నడిగారు. ఎందుకంటె ఇవి ఎత్తులో పెద్దవి గాన చాలాదూరం వరకు చూడగలవనే భావన. వాటినుండి సమాధానం రాలేదు. ఇవి పెద్దవైనందున గర్విష్ఠులు మాట్లాడడంలేదని గోపికలు అనుకున్నారు. తరువాత యమునా తీరంలోని చిన్న చిన్న వృక్షాలనడిగారు. వాటినుండీ సమాధానం రాలేదు. తరువాత లతలను, పొదలను, తులసీచెట్టను అడిగారు, వాటినుండీ ఏమాత్రం సమాధానం రాలేదు. పోతన భాగవతంలో ఇక్కడొక చక్కని పద్యం కనిపిస్తుంది -

ఉ॥ నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వు రా
జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దెచ్చెనో
మల్లియలార మీపొదలమాటున లేడుగదమ్మ! చెప్పరే॥

ఉ॥ అంగజునైన జూడ హృదయంగముడై కరగించువాడు
శ్రీరంగధురీణంబువాడు మధురంబగు వేణురవంబువాడు మ

మ్మంగజు పువ్వుదూపులకు నగ్గముచేసె లవంగి లుంగ నా
రంగములార! మీ కడకు రాడుగదా! కృపనున్న జూపరే॥
తే॥ పొగడదగువాని గానరే పొగడలార !
యీడెరుంగని విభుజూపుడీ డెలార !
మొల్లమగు కీర్తివాడేడీ మొల్లలార !
శుకనిగదితుని జెపుడు కింశుకములార !

వ॥ అనుచు నున్మత్త చిత్తలై తదాత్మకత్వంబున గృష్ణులీలల ననుకరింపుచు.

ఎవరు చెప్పగలరు, ఎవరు చెప్పలేరనే విషయమే గోపికలకు గుర్తులేకుండా పోయింది. అదుగబడేవి చేతన వస్తువులా? జడవస్తువులా? అనేదీ పోయింది - ఇదే ఆవేదన నిజస్వరూపం. ఏడ్చి ఏడ్చి కళ్లు ఎర్రబడ్డాయి - గొంతు బొంగురుపోయింది - ఒళ్ళంతా చమటలు, వారి దృష్టిలో కేవలం కృష్ణుడే - వాక్కులో కృష్ణుడే, మనస్సులో కృష్ణుడే, వారి చిత్తవృత్తి అన్నివిధాలా కృష్ణమయమయింది - కృష్ణుని చింతిస్తూ చింతిస్తూ గోపికలు తమ్ముతామే కృష్ణునిగా భావించారు. కృష్ణుడు జేసిన లీలలనన్నింటిని వారు చేస్తూ వున్నారు.

"కృష్ణోఽహం పశ్యత గతిం లలితామితి తన్మనాః"

నేను కృష్ణుడను నా మృదువైన నడకచూడు. ఈ విధంగా ఒక గోపిక మృదువుగా నడువసాగింది. ఇంకో

గోపిక కృష్ణవేషంతో పూతనసంహారం, ఇంకొకతే కాళీయ మర్ధనం, మరొకతి గోవర్ధనగిరినె త్తినట్లు నానారకాల లీలలను వారికివారే ప్రదరిస్తూ వున్నారు. వేదాంతి "సోఽహం, సోఽహం" అని అనుసంధానం చేసినట్లు గోపికలు "కృష్ణోఽహం, కృష్ణోఽహం" అని అనుసంధానం చేస్తు న్నారు. ఈ తన్మయతలోనే శ్రీకృష్ణుని అడుగుల గుర్తులు కనుపించాయి - వాటిని అనుసరిస్తూ వెళ్ళారు. కాని కృష్ణ దర్శనం కలుగలేదు. తిరిగి తిరిగి అలసిపోయారు. కావాల్సిన వస్తువు దొరకలేదు.

వస్తువు ఎక్కడపోతుందో అక్కడే వెతకాలి. ఇంకో దగ్గర వెతికితే లభిస్తుందా, ఇంట్లో సూది పోగొట్టుకుని వీధి లైటు వెలుతురులో వెతికినట్లుంటుంది. గోపికల దృష్టి వెనుకకు తిరిగింది. ఆవేదన మరింత పెరిగింది. ఏం చేయా లనుకున్నారు. కృష్ణుడు కనుపించకుండపోయింది యమునా తీరంలో, వెతికేది అరణ్యంలో, ఇది బాగులేదనుకున్నారు. అందరూ కలసి యమునాతీరానికి చేరుకున్నారు. అందరూ ఒక దగ్గర కూచున్నారు. ఇపుడేం చేయాలి ? మూల భాగ వతంలో వారి చేష్టలు ఇలా చెప్పబడినవి.

తన్మనస్కా స్తదాలాపా స్తద్విచేష్టాస్తదాత్మికాః ।
తద్గుణానేవ గాయంత్యో నాత్మాగారాణి సస్మరుః ॥

5

గోపికల మనస్సు వారిదికాదు. అవి శ్రీకృష్ణునిది అయిపోయింది. వారు పరస్పరం కృష్ణచర్చ చేస్తూన్నారు - లీలలను చెప్పుకుంటున్నారు - చిత్తం కృష్ణునియందే లయించింది. అతని గుణగానం చేస్తూవున్నారు. వారికి వారి ఇల్లు, వాకిలి, బంధువుల స్మరణ ఏమిటి? చివరికి వారి దేహ స్మరణగూడ లేదు.

గోపికలు గోపికలే. గోపిక అనే పదానికి అర్థం దాచివుంచేదనీ తమ ప్రేమను దాచివుంచేవారు. ప్రేమ బజారులో అమ్మేదికాదు. బహిర్గతంగా ప్రకటించేదీ కాదు. అది హృదయమందిరంలో రహస్యంగా దాచి వుంచేది.

ప్రేమాద్వయో రసికో యోరపి దీప ఏవ
హృద్వేశ్మ భాసయతి నిశ్చలమేష భాతి।
ద్వారాదయం వదనతస్తు బహిర్గతశ్చేత్
నిర్వాతి శాంతిమథవా తనుతాముపైతి॥

రసికుల హృదయంలో వ్యక్తమయ్యే ప్రేమ దీపంతో సమానంగా వుంటుంది. ఇది హృదయంలో వున్నంతవరకు హృదయం ప్రకాశవంతంగా ఆనందంగా వుంటుంది - కాని ఈ ప్రేమే ముఖం ద్వారా బయటికి వచ్చినపుడు, నోటితో చెప్పి ప్రకటించినపుడు బయటి వాతావరణం ద్వారా ఆరిపోవచ్చు లేదా నశించనూ వచ్చు.

ప్రేమ గులాబి రేకులకంటే మృదువైంది. అది లోకుల దృష్టిని సహించలేదు. ప్రేమ స్వరూపులగు గోపికలు తమ ప్రేమను గుప్తంగా వుంచుకున్నారు. కేవలం ప్రేమనేకాదు. భగవంతునిగూడ హృదయగుహలో గుప్తంగా వుంచుకున్నారు.

గోభిరింద్రియైః పిబతి శ్రీ కృష్ణరసమితి గోపీ ॥

ఇంద్రియాలను గోవులంటారు. తమ ఇంద్రియాలతో శ్రీకృష్ణరసాపానం చేసినందున వారిని గోపికలంటారు. వారు వారి కళ్ళతో శ్రీకృష్ణరూప మాధుర్యాన్ని పానం చేస్తారు - శ్రవణేంద్రియం ఆయన మురళీరవ మాధుర్యాన్ని పానంచేస్తుంది - వారి శరీరం, కాళ్ళు, చేతులు సమస్త అంగాలు కృష్ణరసంతో పరిపూర్ణమైవుంటాయి,

రామాయణకాలంలోగూడ రామునికి సీతకు, రామునికి భరతునికి వియోగం కలిగింది. అయితే ఆ వియోగంలో కొంత విలక్షణత్వంవుంది. సీత వియోగంలో ఆవేదన ఇరువైపులావుంది. కాని భరతవియోగంలో ఆవేదన రాముని గురించిన వియోగదుఃఖం భరతునికి మాత్రమేవుంది. ఇక్కడగూడ గోపికలకు మాత్రమే వియోగదుఃఖం. పరమ పురుషుడు, పురుషోత్తముడు యోగేశ్వరుడైన శ్రీకృష్ణ పరమాత్మకు లేదు. రాముని సమయం సీత చింతనలో గడిచింది. సీత, భరతుని కాలం రాముని చింతనతో గడిచింది. రోమరోమంలో రామనామం పలికింది ఆంజ

నేయునికి. ప్రతి శ్వాసలో కృష్ణనామం పలికింది అర్జునునకు. వియోగంతో కొందరు - సంయోగంతో మరికొందరు భగవదాయత్త చిత్తులై యున్నారు. నిజమైన ప్రేమభక్తి సంయోగ, వియోగ సమయంలో కూడ విడవకుండా ఉండడమే - సంకటంవస్తే వెంకటరమణ కాదు అది అష్టైశ్వర్యాలు వచ్చినా వుండాలి; అదియే ప్రేమకు పరాకాష్ట.

నిరాకార సాధకునికి ఆత్మసంబంధమైన స్పర్శనాదులుండవు. అతను నిరాకారాకారిత వృత్తియందుండనచ్చు. లేదా ద్రష్ట స్వరూపస్థితిలోనూ ఉండనచ్చు. బ్రహ్మాత్మైకత్వ స్థితినిగూడ అనుభవిస్తారు. కాని -

యహ్ ప్రేమ్‌కో పంథ్ కరారో మహా,
తర్‌వార్‌కీ ధార్‌పై ధావనోహై ॥

ధ్యానం చేసేవారికి పరమాత్మ మానసికానుభవం కలుగుతుంది. వారికి భగవంతుని మానస ప్రత్యక్షమవుతుంది. జ్ఞానులకు జ్ఞానస్వరూపంలో భగవత్ప్రాప్తి కలుగుతుంది. కాని భక్తుడు ఈ చర్మచక్షువుల ద్వారా భగవదను గ్రహించే భగవంతుని దర్శించగలుగుతాడు. భగవదవతారాన్ని మనం ఒప్పుకుంటాం - ఎందుకు? ఇప్పుడే, ఇక్కడే ఈ శరీరంతోనే భగవద్రసానుభూతిని ఆస్వాదించాలని -

ఈశ్వరుడు నిరాకారుడు. జీవులు వేరు వేరు - జగత్తు ప్రకృతి కార్యం - ఇలా అనుకుని అవతార సిద్ధాంతం స్థిరం చేయబడదు - అవతారసిద్ధాంతంలో పరమాత్మకంటె భిన్నమైన వస్తువులేదు - అదే ప్రకృతిరూపం, అతనే జీవరూపం. అతనే సర్వాత్మరూపంలో ప్రకటమవుతూ వుంది - భక్తుని హృదయంలో యథార్థమైన భక్తి వృద్ధి చెందినపుడు తన అవ్యక్తరూపంనుండి వ్యక్తమవుతాడు, ఈ రకంగా ఎవరిముందు ఆ పరమాత్మ ప్రత్యక్షంగా ఉంటుందో, తన ఇంద్రియాలద్వారా ఆ తత్వరసాస్వాదనం చేస్తారో వారే గోపికలు -

"గాః ఇంద్రియాణి పాంతి గోప్యః, గోపాః వా"

తన ఇంద్రియాలను లక్ష్యంనుండి జారకుండ రక్షించే వారలే గోపికలు లేదా గోపాలురు. గోపికల మార్గం సంయమనంతో కూడింది. ఇంద్రియాలను యథేచ్ఛగా విడిచే మార్గంకాదు -

గోపికలు వారి ఇంద్రియాలను దృఢంగా సంయమనం చేసుకున్నారు, వశీకరణం చేసుకున్నారు. అందుకే శ్రీకృష్ణుని వదలి వారి ఇంద్రియాలు అన్యత్ర వెళ్ళలేవు.

"సంత్యజ్య సర్వవిషయాన్ తవపాదమూలమ్"

ఒక గోపిక అంటూంది- సమస్త విషయాలను విడిచి మేము మీ చరణకమలాలను ఆశ్రయించాము.

"తదర్థ వినివ_ర్తిత సర్వకామాః"

సమ_స్త కోరికలు నీకే వదిలాము. నీకే అంకితం చేశాం.

గోపికలకు మృత్యుభయంలేదు. రాత్రంతా అరణ్యమంతా తిరిగారు. హింసక జంతువులున్నాయనే విచారణే లేదు. వారి చి_త్తంవుంది వేరొకచోట - శరీరం పోతుందనే భావన, ప్రాణహాని ఇవేవీ గు_ర్తుకు రాలేదు - త్రిభువన మోహనుని వియోగంతో ప్రాణంపోయినామేము శ్రీకృష్ణున్నే చేరుకుంటాం అనే ధైర్యం వుండింది. ప్రాణప్రయాణ సమయంలో ఏ భావనవుంటే అదే సిద్ధి_స్తుందని భగవద్వాణి. ఈ రహస్యం వారికి బాగా తెలుసు - అరణ్యం, జంతువులు, చీకటి, ప్రాణభయం, ఏమీ వారికి బాధ కలిగించలేదు.

శోకే క్షోభే చ హృదయం ప్రలాపైరవధార్యతే ।
పూర్ణోత్పీడే దటాకస్య పరీవాహః ప్రతిక్రియా ॥

చెరువులో ఎక్కువనీరు నిండినచో కట్ట తెగుతుందనే భయంవ_స్తుంది. ఆ చెరువులోని నీటిని తీసి వేయుటే చెరువును రక్షించడం అవుతుంది. అలాగే శోకం, లేదా భయం అతి భయంకరంగా ప్రా_ప్తించినపుడు ప్రలాపాల (మాటల) ద్వారా ఆ ఉద్వేగాన్ని తగ్గించుకోవాలి. అపుడే మనస్సు స్థిరమవుతుంది. లేదా ప్రాణాయామం - గోపికల శోకం అత్యంత ప్రబలమైంది - ఆ శోకం అధికమైతే వీరి

ప్రాణాలు పోతాయి - కృష్ణవియోగంతో గోపికలు మరణించారనే అపవాదు కృష్ణునిపై ఆపాదించబడుతుంది. ఆ అపవాదు తన ప్రియతమునికి కలుగగూడదనే భావంతో వారు జీవించేదానికి ప్రయత్నించారు - భారతీయనారి తాను ఎన్నికష్టాలైనా భరిస్తుంది కాని తన పతికి అవమానకరమైన చేష్టలు చేయదు - పతి శ్రేయస్సే తనవిగా భావిస్తుంది. రోగసంతుడైనా, యోగవంతుడైనా, ధనికుడైనా, దరిద్రుడైనా ఆదరించి తన సుఖాన్ని పతిలో చూస్తుందేకాని అన్యథా చరించదు. ఇక్కడ గోపికల స్థితీ అంతే - తన మరణం ద్వారా ప్రియునికి అపవాదు మంచిది కాదనుకున్నారు - ఏడ్పు ద్వారానో పాట ద్వారానో హృదయంలోని ఉద్వేగాన్ని తగ్గించుకోవాలనుకున్నారు. అందువలన రాబోయే గానం ద్వారా వారి బాధను మరచిపోతున్నారు. ఆ బాధ నివృత్తికొరకు పాడినపాటే (ఏడ్పే) గోపికాగీతలని శ్రీమద్భాగవతంలో ప్రసిద్ధి చెందాయి.

గోపీగీతల ఛందస్సు కనకమంజరీ ఛందస్సని పెద్దలంటారు. దీని ప్రతి పాద రెండవ అక్షరం ఒకటిగానే వుంటుంది. ఏడవ అక్షరంగూడ అలానే వుంటుంది. - కనకమంటే ఉమ్మెత్తచెట్టు అని ఒక అర్థంవుంది. ఉమ్మెత్తపూలగుత్తి మాదిరి మృదువుగా, ఉన్మాద కరుణ స్వరంగా ఈ ఛందస్సుంటుంది.

ఇక్కడొక సందేహం కలుగవచ్చు - వియోగ దుఃఖంలో గోపికలు ఉత్తమమైన ఈలాంటి కవిత్వాన్ని ఎలా రచించారు?

రెండవ విషయం గోపికలు చాలామంది ఉన్నారు. వారందరూ చెప్పినపుడు ఒకే ఛందస్సు, ఒకే భావం ఎలా వ్యక్తమయింది? లేదా వారు వేరు వేరు ఒక్కొక్కరు చెప్పి యుంటే పంతొమ్మిది (19) శ్లోకాలు మాత్రమే ఎలా చెప్పారు? ఒక్కొక్కరు ఒక ఛందస్సు చెప్పినా చాలా అవుతాయి, ఇంకో ప్రశ్న ఏమంటే ఈ ఛందస్సులో ఏదైనా క్రమపద్ధతి, సందర్భం ఉందా లేదా?

గోపికలు శ్రీకృష్ణుని ప్రేమ వియోగంతో చెపుతూ వున్నారు. ఈ విషయాన్ని మరువవద్దు - ప్రేమ గతినృత్యం- ప్రేమ వాణి సంగీతం - గోపికలు ఎవరిచేత నృత్య, సంగీతాలు నేర్చుకోలేదె. సంగీతానికి, నృత్యానికి ఎవరు గురువులూ లేరు. వారు పాడేదానికి అర్థమేంటో వారికి తెలియదు. ఈ సంగీత నృత్యాలు వారికి ఎవరు నేర్పారు. జన్మతో వచ్చిన వారి హృదయంలోని శ్రీకృష్ణ భక్తియే వారికి నేర్పింది - హృదయంలో ప్రేమ కలిగినప్పుడు. సమస్త వ్యవహారం స్వరమయం నృత్యమయం అవుతుంది.

గోపికలు ఏ కావ్యాచార్యునితో ఛందశ్శాస్త్రం చదువలేదు. కావ్యరచనలూ చేయలేదు. నారద తుంబురా

దులతో సంగీతమూ నేర్చుకోలేదు. వారు ప్రేమ శాస్త్రాన్ని కూడ అధ్యయనం చేయలేదు. వారి హృదయంలోని ఆవేదన రూప ఉత్కృష్ట శ్రీకృష్ణ ప్రేమయే కవిత్వంగా ప్రకటన మయింది.

ఒకే భావం కలిగిన వ్యక్తులు ఒకేసారి చెప్పినపుడు స్వతః వారి స్వరం ఒకటిగానే వుంటుంది - వారి శబ్దం ఒకే మాదిరి అభివ్యక్తమవుతుంది - ఇందులో ఆశ్చర్యమేమీ లేదు-మానసికశక్తి, హృదయ ఆవేదన భావంలో భావాన్ని చూపులో చూపును, మాటలో మాటను ఏకం చేస్తుంది. ఒక్కొక్కసారి మనం నీళ్ళు త్రాగినా, అన్నం తిన్నా పొర పోవడం గమనిస్తుంటాం. గోపికలందరకు పరమప్రియుడు శ్రీ కృష్ణుడు. లోకంలో వారికి ఆయనన్నమించిన ప్రియ వస్తువింకొకటి లేదు. ఈ స్థితియే ప్రహ్లాదునికీ కలిగింది - "వస్తుదృష్టి జేసి వాంఛయిడడు" ఫలానా వస్తువు కావాలనే కోరిక, పొందాలనే ప్రయత్నం లేదు - ఉండదు. పొంద వల్సిందాన్ని పొందింతరువాత ఇక రెండవదానిపై ప్రేమ ఎక్కడ ? ఉన్నతస్థితిని బొందినవారు సేవకావృత్తిని చేయ నట్లు భగవదానందాన్ని ఆస్వాదించిం తరువాత ప్రాపంచీ కానందం రుచించదు. గోపికలందరు శ్రీకృష్ణ వియోగంతో వ్యాకుల చిత్తులై వున్నారు. కృష్ణ సంయోగ సమయంలో వారివారి భావాల్లో వేరువేరుగ ఉంటే ఉండవచ్చు - కాని

వియోగపరిస్థితిలో అందరిభావం ఏకమే. అందరూ ఒకే దాన్ని కావాలనుకుంటున్నారు. శ్యామసుందరుడు వారి ఎదుట ప్రత్యక్షం కావడమే వారి అభిలాష. ఆయన దర్శనంతో వారి హృదయాల్లోని వియోగతాపం పోవాలనేదే వారి ఆవేదన - ఈ రకంగా అందరి భావం, అందరి చిత్తం పూర్తిగా ఒకటయినందున వారి సంగీత స్వరం శబ్దావళి ఒకటికావడంలో ఆశ్చర్యమేమీ లేదు.

నూవుల మాదిరి స్వచ్ఛమూ, కోమలమూ అయిన ఇసుక రేణువులతో విశాలమైన యమునానదీతీరం. యమునా జలం అలలతో కలకలరవంచేస్తూ వుంది. తీరం సమాప్తమైన చోటునుండి బృందావనారణ్యం - ఆ అరణ్యంలో రకరకాల పుష్పాలు పుష్పించివున్నాయి - వాటిపై నుండి మందవాయువుతో అరణ్యమంతా సుగంధమయమయింది. శరదృతువులో చంద్రప్రకాశం మేఘరహితమై స్వచ్ఛంగా వుంది. ఆ వెన్నెలలో సమస్తసృష్టి స్నానంచేసి తెలుపుగా కనుపిస్తూవుంది. మల్లెపూల తెలుపుదనంలోంచి సుగంధం బయటికి వచ్చి పరిసరప్రాంతాల వారిని అతిథిసత్కారం చేస్తూంది, ఈలాంటి శోభాయమానమైన రాత్రి మీద ఎవరికీ దృష్టిరాలేదు. యమునాతటంపై రంగురంగుల వస్త్రాలు ధరించి శ్యామసుందర, మురళీ మోహనుని వియోగ వ్యాకులత్వంతో ఏడుస్తూ అనేక వేల గోపికల సమూహం

తమ ప్రాణధనం, హృదయేశ్వరుడు అయిన పరమాత్మను కరుణతో కరిగిన కంఠంతో పిలుస్తూ గానంచేస్తూవున్నారు.

నిజంగా వారుపాడిన గీతలు మనం పాడినా, విన్నా మనహృదయం ఆనందంతో పొంగిపోతుంది. రాగయుక్తంగా చెప్పినపుడు మనస్సులలో ఒక తృప్తి కలుగుతుంది - వారు ఎలా ఏడ్చినారో లేక పాడినారో ఆ విషయాన్ని మనం ముందు విచారిద్దాం - విందాం - ఆనందిద్దాం - ఇక మనం అసలుగ్రంథంలోకి ప్రవేశిద్దాం -

జయతి తేఽధికం జన్మనా వ్రజః
శ్రయత ఇందిరా శశ్వదత్ర హి ।
దయిత దృశ్యతాం దిక్షు తావకా
స్త్వయి ధృతాసవస్త్వాం విచిన్వతే॥ 1 (సశేషం)

శ్రీ భాగవతీయ ప్రవచనము - 63

మూలం: శ్రీరామచంద్రడోంగ్రే మహరాజ్ వారు.

అనువాదం : పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు.

(గత సంచిక 17 వ పేజి తరువాయి)

యజ్ఞమన్త్రం (ఉచ్చారణదోషం)వలన ఇన్ద్రునిచంపే కుమారునికి బదులు ఇన్ద్రుని చేతిలో చచ్చేపుత్రుడు కలిగాడు, మన్త్రం "ఇన్ద్రశత్రో వివర్ధస్వః ఇన్ద్రశత్రో వివర్ధస్వ" ఈ మన్త్రాన్ని ఉచ్చరించేప్పుడు ఋత్విక్కులు 'ఇన్ద్ర' శబ్దాన్ని ఉదాత్తస్వరంలో

చెప్పారు, శత్రో అనే శబ్దాన్ని అనుదాత్త స్వరంలో ఉచ్చరించారు. అలా స్వరభేదంవలన శబ్దార్థంలో మార్పు కలిగింది, ఫలితంగా ఇన్ద్రఘాతకుడగు పుత్రునికి బదులు, ఇన్ద్రునిచే మరణించు పుత్రుడు పుట్టాడు.

ఈ కారణంచేతనే వేదమన్త్రాలకు అధికారాన్ని అందరికీ ఇవ్వలేదు. మన్త్రోచ్చారణలో, లేక మన్త్రపాఠంలో క్షతికల్గితే అనర్థం జరిగిపోతుంది. కేవలం సాత్త్విక విద్వాంసుడగు బ్రాహ్మణుడే వేదాన్ని నిర్దుష్టంగా పఠించగలడు.

భాగవతంలో కర్మయొక్క నింద చేయబడింది. (కర్మ నిందించబడింది.) భాగవతశాస్త్రంలో కేవలం భక్తికి మహిమనిచ్చి కర్మకు గౌణం ఇవ్వబడిందనికాదు. ఆ సకామకర్మ గౌణంగా తలంచబడింది. కర్మచేసేప్పుడు ఒక్కటే కారణం వుండాలి. అది భగవంతుని ప్రసన్నుని చేసుకోవడమే.

యజ్ఞకుండంలో వృత్రాసురుడు కలిగాడు. అతడుదేవతలను ఏడ్పించసాగాడు. దేవతలయొక్క అస్త్ర – శస్త్రాలన్ని వానిముందు ప్రభావహీనులు కాసాగాయి. దేవతలు గాబరాపడి పరమాత్మను శరణుజొచ్చారు, పరమాత్మను ప్రార్థించసాగారు.

పరమాత్మ దేవతలతో చెప్పాడు – 'దధీచి మహర్షియొక్క ఎముకలతో వజ్రాయుధాన్ని చేయగలిగితే. ఆ వజ్రాయుధంతో వృత్రాసురుడు చస్తాడు' అని. అంతేకాదు దానితోపాటు భగవంతుడు దేవతలను ఇలా నిందించాడు. (వారి దోషాలను ఎత్తి చూపాడు) – "నన్ను ప్రసన్నుని చేసుకొని మీరు భక్తివంటి శ్రేష్ఠవరాన్ని కోరక ఒక తుచ్ఛవస్తువును కోరారు" అని. ప్రభువు తన దివ్యతేజస్సును వజ్రంలో వుంచాడు. వృత్రాసురుని చంప

డానికి వజ్రాయుధాన్ని తీసుకొని ఇన్ద్రుడు యుద్ధరంగంలోనికి యుద్ధం చేయడానికి పోయాడు.

భయాన్ని కలిగించే వృత్తే వృత్రాసురుడు. వృత్తి అన్తర్ముఖమయితే జీవునికి ఈశ్వరునితో కలయిక కలుగుతుంది. ఎట్టి పరిస్థితులలోను ఈశ్వరునినుండి విభుక్తుడివి - వేరు కావాకు. బహిర్ముఖవృత్తి దుఃఖాన్ని భయాన్ని కలిగిస్తుంది. ఈ బహిర్ముఖ వృత్తి దేవతలకు కూడ కష్టాన్ని - భయాన్ని కలిగిస్తుంది.

మనస్సును స్థిరంగా వుంచాలనుకుంటే కండ్లనుకూడ ఒకే స్థానంలో స్థిరంగావుంచు. వృత్తి బహిర్ముఖమైతే కథాశ్రవణంలో గాని, మందిరంలో భగవద్దర్శనం చేయడంలో కాని ఆనందం కలుగదు. బహిర్ముఖవృత్తిని జ్ఞానరూప వజ్రంతో నశింప చెయ్. జ్ఞానం ప్రధానమైనబలము. దీని ఆధారంతో విషయవృత్తులను ఆవరణవృత్తులను (వృత్రాసురుని) చంపు. అప్పుడే ఇన్ద్రియాల అధిష్ఠానదేవతలకు శాన్తి లభిస్తుంది.

భాగవతంలో మొదట చరిత్ర (కథ) చెప్పబడుతుంది, ఉపసంహారంలో సిద్ధాన్తం చెప్పబడుతుంది. ఇతర విషయాలలో రమించడానికి మనస్సు పోని విధంగా బ్రహ్మనిష్ఠ స్థిరంగావుండాలి. మానవుడు విషయాలల్లో ఆనందాన్ని వెదుకుతున్నాడు, అంచేత అతనికది (ఆనందం) లభించడంలేదు. ప్రభువుయొక్క భజనలో వజ్రంవలె స్థిరనిష్ఠను కలిగివుండు.

దధీచి బ్రహ్మనిష్ఠుడైయుండెను. అంచేత అతని ఎముకలలో కూడ దివ్యత్వం వుండినది. ఒక కోటి జపంచేసినట్లైతే మాలలో దివ్యత్వంవస్తుంది, చేతనత్వం వస్తుంది. శాస్త్రంలో చెప్పబడింది - మన్త్రాన్ని, మన్త్రమూర్తిని, జపమాలను ఎప్పటికిని మార్చవద్దు అని.

ప్రతి ఒక్క మన్త్రంలో దివ్యశక్తి వుంది. ఏ మన్త్రం లభించినా దానిపై దృఢమైన నిష్ఠగల్గి జపంచెయ్. మూర్తినికూడ ఎప్పటి కిని మార్చవద్దు. ఏ స్వరూపంపై రుచివుందో దానిపై పరిపూర్ణ నిష్ఠను వుంచు దానినుండే ప్రభువు ప్రకటితమౌతాడు.

వజ్రాయుధాన్ని ధరించి ఇన్ద్రుడు వృత్రాసురునితో యుద్ధం చేయడానికి పోయాడు. ఇద్దరిమధ్య భీకరమైన యుద్ధం జరిగింది. వృత్రాసురుడు పుష్టిభక్తుడు. ఇన్ద్రునిచేతిలో ఎందులో నారా యణుడు వున్నాడో ఆ వజ్రాయుధముంది. కాని ఇన్ద్రునికి కని పించడంలేదు. (నారాయణుడు) వృత్రాసురునికి కనిపిస్తున్నాడు. ఎందుకంటే అతడు పుష్టిభక్తుడు, అతను ఇన్ద్రునితో అంటాడు – ఓ ఇన్ద్రా! నీవు నాపై వజ్రాయుధాన్ని త్వరగా ప్రయోగించు – (వజ్రాయుధంతో నన్ను త్వరగా కొట్టు.) నీకు జయంకలిగితే కలుగుగాక! కానీ నీపైనకంటే నాపైననే భగవంతుని కృప అధికంగా వుంది.

లౌకిక సుఖాలప్రాప్తికి నీవు చేసే ప్రయత్నాలు సఫలం కాకపోతే తెలుసుకో భగవంతుడు నీపై కృపచూపినాడని, భగవం తుడు ఏ జీవునిపై అధికకృప చూపుతాడో వానికి లౌకికసుఖాలు అధికంగా ఇవ్వడు. లౌకికసుఖాలు లభిస్తే జీవుడు ఈశ్వరుని యందు విముఖుడు అవుతాడు,

లౌకిక సుఖాల ప్రాప్తికోసరం శ్రీకృష్ణుని నామస్మరణ ఎప్పుడు కూడ చేయకు. లౌకికసుఖాలల్లో విఘ్నాలు ఉపస్థితమైతే ప్రభువు నాకు అలౌకిక సుఖాలను ఇవ్వనున్నాడని తెలుసుకో. ఏ జీవునిపై భగవంతుని కృప విశేషంగా కలుగుతుందో అతని లౌకిక సుఖప్రాప్తికి చేసేప్రయత్నాలను భగవంతుడు సఫలం

చేయనీయడు. ఏ జీవునిపై భగవంతుడు సాధారణ కృపను చూపు తాడో అతనికి లౌకికసుఖాలను ఇస్తాడు.

వృత్రాసురుడు ఇంద్రునితో అన్నాడు. ఓ ఇంద్రా! జయం నీకే కానుంది మరియు స్వర్గరాజ్యం కూడ నీకే లభిస్తుంది; కానీ నేను ఎచటినుండి నాకు పతనంలేదో అట్టి నా భగవంతుని ధామా నికి పోతాను. స్వర్గం నుండి నీకు పతనం కలుగవచ్చు; కానీ నాకు ప్రభుధామం నుండి పతనం కలుగదు. నాకు లౌకికసుఖాలు లభించకుండు గాక! కాని నేను ప్రభువుయొక్క ధామానికి పోతాను.

వృత్రాసురుడు శ్రీహరిని స్తుతించసాగాడు. ఆ స్తుతిని (స్తోత్రాన్ని) వైష్ణవగ్రంథాలు చాలా ప్రశంసించాయి. ఈ స్తోత్రం లోని మూడవ శ్లోకాన్ని అనేకమంది మహాత్ములు తమ ప్రియ శ్లోకంగా భావించారు.

"అహం హరే తవపాదైకమూల దాసానుదాసో భవితాస్మి భూయః।
మనః స్మరేతాసుపతేర్గుణాంస్తే గృణీత వాక్కర్మ కరోతు కాయః॥
న నాకపృష్ఠం న చ పారమేష్ఠ్యం న సార్వభౌమత్వరసాధిపత్యమ్।
న యోగసిద్ధి రపునర్భవం వా సమఞ్జసం త్వా విరహయ్య కాంక్షే॥
అజాతపక్షా ఇవ మాతరం ఖగాః స్తన్యం యథా వత్సతరాః క్షుధార్తాః।
ప్రియం యథా హి వ్యుషితం విషణ్ణా మనోఽరవిందాక్ష దిదృక్షతే త్వామ్॥
మమోత్తమ శ్లోకజనేషు సఖ్యం సంసారచక్రే భ్రమతః స్వకర్మభిః।
త్వన్మాయయాఽత్మాత్మజ దారగేహేష్వసక్త చిత్తస్య ననాథ భూయాత్॥ (భా॥ 6-11-24-27)

ఓ ప్రభూ! తమరి చరణకమలాలను అనన్య భావంతో సేవించే అవసరాన్ని మరుజన్మలో కూడ నాకు కలిగేటట్లు నాపైన

కృపచూపు. ఓ ప్రాణవల్లభ ! నా మనస్సు తమరి మంగళమయ గుణాలను స్మరిస్తూ వుండనీ నా వాక్కు తమరిగుణాలను గానం చేస్తూ వుండనీ, నా శరీరం తమరి సేవలో లగ్నమై వుండనీ.

ఓ భగవంతుడా ! తమరిని వదలితే నాకు స్వర్గం, బ్రహ్మలోకం, భూమండలం, రసాతలం, యోగసిద్ధులు, మోక్షం పైనకూడ ఇచ్చలేదు. (తమరు లేకుండా పినన్నిటిని నేను ఏమిచేయాలి? నీవుతప్ప నాకింకేమి వద్దు.)

ఓ కమలాక్ష ! రెక్కలులేని (రాని) పక్షిపిల్ల ఏవిధంగా తన తల్లిని ఎదురుచూస్తూంటూందో. ఆకలిగొన్న లేగదూడ తనతల్లీ ఆవుకోసరం ఎలా ప్రతీక్షిస్తూంటుందో, విరహిణి భార్య పరదేశంలో నున్న తన భర్తతో కలపడానికి ఎలా ఉత్కంఠతో వుంటుందో అవిధంగా నా మనస్సు నీదర్శనం కోసరం వ్యాకులమైవుంది. (ప్రభువును కలుసుకోవడానికి ఆతురత ఎంత గొప్పదో ఈ దృష్టాంతాలతో చెప్పబడింది.)

ప్రభో ! నాకు మోక్షేచ్ఛలేదు. నా కర్మలఫలితంగా నేను జీవనమరణ చక్రంలో మాటిమాటికి తగులుకోవలసివచ్చినా చింత లేదు. కానీ నేను ఎక్కడకుపోనీ, ఏ కడుపునపుట్టనీ అచట నాకు భగవద్భక్తుల మైత్రి లభిస్తూవుండనీ: భగవన్ ! నేనింతమాత్రం కోరుతూన్నాను. ఏమంటే - నీ మాయవలన శరీరం, భార్యబిడ్డలు మొదలైన వానియందు ఆసక్తిగల మానవులతో నాకు ఏలాటి సంబంధం కలుగకుండు గాక ! (అని వృత్రాసురుని ప్రార్థన.)

దీనుడై శరణుచొస్తే జీవుణ్ణి భగవంతుడు తన దగ్గరికి చేర్చుకుంటాడు, తనవాణ్ణి చేసుకుంటాడు. వృత్రాసురుడు ఎంత దీనుడుగా వుండినాడు. అతనంటాడు - నేను భగవంతుని సేవచేయ

డానికి అపాత్రుణ్ణి, అంచేత భగవంతుని దాసులయొక్క దాసులకు సేవచేస్తాను. నేను భగవంతుని సేవకులైన వైష్ణవుల సేవచేస్తాను. నేను అన్ని ఇంద్రియాలకు భక్తిరసాన్ని దానంచేశాను. నా వాక్కు శ్రీకృష్ణుని కీర్తన చేయుగాక! నా చెవులు నీ కథాశ్రవణం చేయుగాక!

వైరాగ్యం లేకుండా భక్తి దృఢం కాజాలదు. భోగాలకోసరం భక్తిని చేయవాకు. భక్తి భగవంతుని కోసరం చేయబడుతుంది. రెండవ శ్లోకం వైరాగ్యానికి సంబంధించింది. వృత్రాసురుడు భక్తిద్వారా ఇంద్రుని రాజ్యాన్ని లేక మోక్షాన్ని పొందడానికి అభిలషించలేదు. భగవంతుడు వృత్రాసురుని అడిగాడు – వైష్ణవుల (విష్ణుభక్తుల) సేవచేసి నీవు ఏదైనా కోరుకోవాల్సివుందా - దానికి వృత్రాసురుడు జవాబిచ్చాడు - 'నాకు స్వర్గం ఏమిటి? బ్రహ్మలోక రాజ్యంపై కూడా ఇచ్ఛలేదు' అని. భోగాభిలాష భక్తికి బాధకము.

దేనివలన విషయవాసన పెరుగుతూ పోతూందో విషయవాసన పెరుగుటచే జీవితం - జీవనవిధానం భ్రష్టమవుతూందో - చెడుతూందో అట్టివిద్య నేడు నేర్పబడుతూంది.

వృత్రాసురుడంటున్నాడు - నాకైతే ఏలాటి కోరికలేదు. నేను తమరి సేవచేయ కోరుతున్నాను. నేను తమరికి ఉపయోగపడాలనుకుంటున్నాను.

మొదటి శ్లోకంలో వృత్రాసురుని శరణాగతివుంది. రెండో శ్లోకంలో అతని వైరాగ్యం ప్రకటితమవుతూంది. జ్ఞాని శరణాగతికి మూడు భేదాలు ఒప్పుకుంటాడు ప్రభూ నేను నీవాణ్ణి. పరమాత్మ ద్వారా దగ్గర తీసుకొనడంతో జీవుడు భగవంతుణ్ణీ భగవంతుడు నావాడు అని తలుస్తాడు. భగవంతుడు నావాడు అను భావం

కలుగగానే ప్రపంచంలో ఇపుడు ఇంకేమీ లేదుఅని అనుభవం కలుగుతుంది.

జ్ఞాన వైరాగ్యాలు వృద్ధిఅయిన పిదప సమస్తం భగవన్మయం గానే అనిపిస్తుంది. "నాది" అనేది పోతుంది. 'అహం బ్రహ్మాస్మి' ప్రతీతమవడం ప్రారంభిస్తుంది. ప్రపంచంలో అతనికి భగవంతుడు మినహా మరేమీ వుండదు, "నేను" వుండదు. 'నేను' ఈశ్వరునిలో విలీనమైపోతుంది. వైరాగ్యంలేకుండా శరణాగతి దృఢం కాజాలదు.

మూడవ శ్లోకంలో ప్రార్థనచేయబడింది - ఓ ప్రభూ! తాము తమ దర్శనవిషయంలో నన్ను ఆతుదుణ్ణి చెయ్. పరమాత్మ పూర్ణ మైన ప్రేమను కోరుతాడు. కానీ జీవుడు పరమాత్మకు పూర్ణ ప్రేమను ఇవ్వడు. అంచేత అతనికి పరమాత్మ ప్రకాశించడు. జీవుడు తన ప్రేమను భార్యాబిడ్డలకు ఇస్తాడు. అంచేత వృత్రా సురుడంటాడు - నాకు ఒకటే కోరిక, అదేమంటే నీ దర్శనంకోసం నేను ఆతురుణ్ణి అగుదును గాక! అని -

నాల్గవ శ్లోకంలో వృత్రాసురుడు సత్సంగాభిలాషను వ్యక్తం చేశాడు. ఆయనంటున్నాడు – పునర్జన్మఅంటూవుంటే ఓ ప్రభూ! నన్ను విష్ణుభక్తుని ఇంటి ఆవునుగా పుట్టించు. నా పాలు ప్రభువుకు (భగవంతునికి) ఉపయోగపడేట్లుంటే నేను ఆవును కావడానికి కూడ తయార్. పశుజన్మలో కూడ నాకు సత్సంగం లభించు గాక!

వృత్రాసురుని స్తుతికి ఇన్ద్రాసనంకూడ ఊగులాడ – కదల సాగింది. భక్తి భగవంతుణ్ణి పరతంత్రునిగా చేస్తుంది. అంటే భక్తి భగవంతుణ్ణి భక్తుని వశంచేస్తుంది. అంచేతనే భగవంతుడు ముక్తి నైతే ఇస్తాడు, భక్తినికాదు. భగవంతుడెపుడు కృపను ప్రసరిస్తాడో అప్పుడు ఆఖరులో నశించే సంపత్తినిగాక భక్తినే ఇస్తాడు. భగ

వంతుడు ముక్తినైతే శీఘ్రంగా – త్వరగా ఇస్తాడు; భక్తినికాదు. ఎందుకంటే భగవంతుడు భక్తిని కనుక ఇస్తే అతను భక్తునికి సేవకుడు కావలసివస్తుంది. భక్తి స్వతంత్రుడైన పరమాత్మను ప్రేమబన్ధనంలో బంధిస్తుంది.

భగవంతుని స్తోత్రం తరువాత ఇన్ద్రుడు వృత్రాసురుని చంపాడు. వృత్రాసురుని శరీరంనుండి వెలువడిన తేజస్సు – కాంతిపుంజం భగవంతుని శరీరంలో విలీనమైంది. భగవంతుడు వృత్రాసురుని ఉద్ధరించాడు.

ఆరవ స్కన్ధంలో పుష్టిలీలా వర్ణనవుంది. (పుష్టి భక్తి లీలా వర్ణనవుంది.) భగవంతుడు వృత్రాసురునికి పుష్టి భక్తిని ఇచ్చాడు అంటే అతనిపై కృపను చూపాడు అని అర్థం.

పరీక్షిత్తు అడిగాడు – ఇంతటి భక్తుడైనప్పటికి వృత్రాసురుడు రాక్షసకులంలో ఏల జన్మించాడు? అతనికి ఇంతటి తీవ్రమైన హరిభక్తి ఎట్లు ఎలా లభించింది? అతని పూర్వవృత్తాంతం ఏమిటి?

శుకమహర్షి వర్ణిస్తున్నాడు – ఓ రాజా! విను, వృత్రాసురుడు పూర్వజన్మలో చిత్రకేతుడు అనే రాజుగా వుండినాడు. అతని రాణిపేరు కృతద్యుతి. వారికి సంతానం లేకుండెను. ఇచట శబ్దార్థాన్నికాదు, లక్ష్యార్థాన్ని గ్రహించాలి. ఎవడు చిత్రవిచిత్రకల్పనలను చేస్తాడో వాడే చిత్రకేతువు. బుద్ధే కృతద్యుతి. మనస్సు అనేక విషయాలను ఆలోచిస్తుంది. మనుష్యులు అట్టి విషయాకారస్థితిలో చిత్రకేతుజన్మ కలుగుతుంది. మనస్సులో ఒకచోట చేరిన బాహ్యచిత్రాలే భగవద్భజనలో విఘ్నకర్తలు అవుతున్నాయి.

ఒకమారు చిత్రకేతు రాజుగారింటికి అఙ్గిరఋషి వచ్చాడు. రాజు అతనిని పుత్రప్రాప్తి కలుగజేయమని కోరాడు. అఙ్గిరఋషి

రాజుతో అన్నాడు - సంతానం గల తలిదండ్రులకు మాత్రం శాన్తి ఎచట కలుగుతూంది ? నీకు ఏ సంతానమూ లేదు. అదే మంచిది. రాజు మనస్సులో సంసారం గురించిన అనేక చిత్రాలు పేరుకపోయి వున్నాయి. అంచేత అతడు సంతానంకోసం ఋషిని చాల బలవంతంచేశాడు. ఋషి అనుగ్రహంతో అతని ఇంట కుమారుడు పుట్టాడు. రాజుకు మరికొందరు భార్యలుండిరి. ఈర్ష్యతో ఎవరో ఒక సవతితల్లి ఆ బాలునికి విషమిచ్చింది, అంచేత ఆ బిడ్డ మరణించాడు. అదిచూచి చిత్రకేతు కృతద్యుతులు ఏడ్వసాగారు.

అట్టి దుఃఖసమయంలో అచటికి అఙ్గిరఋషితోటి నారదుడు కూడ వచ్చారు. పుత్రుని మరణాన్ని చూచి రాజారాణుల విలాపాన్ని చూచి నారదుడు ఇపుడు పుత్రుని గురించి ఏడ్వడం వ్యర్థం అని ఉపదేశించాడు. ఇప్పుడు మీరు మీకోసం ఏడ్చండి. ఆ కుమారుడు ఎక్కడికి పోయాడో అక్కడి నుండి వాపసురాడు.

కుమారులు నాల్గురకాలు-(1) శత్రుపుత్రుడు, (2)ఋణానుబంధ పుత్రుడు (3) ఉదాసీన పుత్రుడు (4) సేవకపుత్రుడు అని. అందు (1) శత్రుపుత్రుడు పూర్వజన్మంలోని ఎవడో శత్రువు ఏడ్పించడానికై ఇపుడుపుత్రునిరూపంలోజన్మిస్తాడు. (2) ఋణానుబంధ పుత్రుడు - గతజన్మలో అప్పిచ్చినవాడు తన అప్పును వసూలు చేసుకోడానికి పుత్రుడుగా జన్మిస్తాడు. (3) ఉదాసీన పుత్రుడు - ఎంతవరకు వివాహం కాదో అంతవరకు అతడు తలిదండ్రులతోటి నివసిస్తాడు. తలిదండ్రుల నుండి అతనేమీ తీసుకోడు, వారికి తానేమి ఇవ్వడు. అటువంటి కుమారుడు వివాహం అవుతానే తలిదండ్రుల నుండి వేరై వేరేకాపురం పెట్టతాడు. తలిదండ్రులకు కోర్కెవుంటుంది. కుమారునికి వివాహమైతే అత

నికి నాల్గుచేతులు (భార్యా భర్తలకు కలసి) వుంటాయి. వారు బాగా తమకు సేవచేస్తారు – అని, కానీ వారు ఈ విధంగా ఆలోచించేటప్పుడు ఈ విషయం మరచిపోతారు – నాల్గు చేతులతోపాటు నాల్గు కాళ్ళుకూడ అవుతాయి – అని, వివాహానంతరం మానవుడు ఎక్కువగా పశువువలె జీవిస్తాడు.

(4) సేవకపుత్రుడు – గతజన్మలో ఎపడో సేవనుపొంది యుంటాడు. కాబట్టి ఈ జన్మలో వారికి సేవను (బదులు) చేయడానికి పుత్రునిరూపంతో వచ్చి సేవచేస్తాడు.

మనం ఎవరికీ సేవచేయకూడదు, కానీ ఇతరులు తప్పక మనసేప చేయాలి – ఇలా ఆశించడం నిరర్థకము.

——o——

ఓమ్

భాగవతగాథలు - ప్రియవ్రతుడు

★

14 మంది మనువులలో స్వాయంభువమనువు ప్రథముడు, అతని భార్యపేరు శతరూప. ఆ దంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అని ఇద్దరు కుమారులు కలిగారు. (ఈ ఉత్తానపాదుడే ధ్రువుని తండ్రి) ప్రియవ్రతుడు పరమ భాగవతశ్రేష్ఠుడు. అతడు బాల్యంలోనే పరమార్థతత్త్వాన్ని నారదుని ద్వారా గ్రహించి పరబ్రహ్మచింతనంలోనే మునిగి తేలుతూ వుండేవాడు. ప్రియవ్రతునికి యుక్తవయస్సురాగానే

స్వాయంభువ అతనికి రాజ్యభారాన్ని అప్పగించటానికి నిశ్చయించాడు. కానీ సంసార మొక సాగరమనీ, అందులో మునిగినవాడు భార్యాబిడ్డలమీద వ్యామోహంతో జ్ఞాన శూన్యుడై అథః పతితుడు కాక తప్పదనీ, ప్రియవ్రతుడు భావించి రాజ్యభారాన్ని స్వీకరించటానికి అంగీకరించ లేదు. ఆతని మనస్సు సదా పరమాత్మునిమీదనే లగ్నమై వుండేది.

ఈ వృత్తాంతమంతా విన్న బ్రహ్మదేవుడు ప్రియ వ్రతుని అభిప్రాయాన్ని మార్చడానికి నిశ్చయించుకొన్నాడు. నక్షత్రాలు అనుసరించే చంద్రునిలాగా చతుర్వేద పరివేష్టి తుడై అతడు హంసావాహనాన్ని అధిష్టించి దేవేంద్రాది దేవతలు తన్ననుసరించి సేవిస్తూవుండగా ఆకాశమార్గాన బయలుదేరి గంధమాదన పర్వతంమీద తపస్సు చేస్తూవున్న ప్రియవ్రతునికి ప్రత్యక్షమయ్యాడు. అప్పటికే అచ్చటికి విచ్చేసివున్న నారద స్వాయంభువులూ, ప్రియవ్రతుడూ బ్రహ్మకు నమస్కరించి స్వాగతం చెప్పారు.

పద్మాసనుడు సంతోషంతో ప్రియవ్రతుణ్ణి చూచి నవ్వుతూ ఇలా అన్నాడు; "కుమారా! విష్ణుమూర్తి నా ద్వారా నీకు పంపిన సందేశాన్ని విను. నేనూ, నారదుడూ మీ తండ్రీ, నీవూ అందరంకూడ ఈశ్వరుని ఆజ్ఞానుసారమే నడుచుకొంటున్నాము. ఆ మహాత్ముని ఆజ్ఞను ఉల్లంఘించడం ఎంతటివారికికూడ సాధ్యంకాదు. ఉత్పత్తి, వినాశాలకూ,

శోకమోహ సుఖదుఃఖాలకూ జీవుడు పరమేశ్వరాధీనుడే కాని స్వతంత్రుడుకాడు. శ్రీమన్నారాయణుని యొక్క వాగ్రూపాలైన వేదాల ప్రకారం సత్వరజస్తమస్సులనే తాళ్లచేత బంధింపబడిన మనమందరం కూడ ముకుతాడు కారణంగా పశువు మనుష్యునికి స్వాధీనమైనరీతి ఈశ్వరాజ్ఞను అనుసరించి ప్రవర్తిస్తూవుంటాము. మరియు కన్నులు గల వానిచేత నడిపించబడే గ్రుడ్డివానిలాగా పరమేశ్వరుడు ప్రసాదించిన సుఖదుఃఖాల్ని అనుభవిస్తూవున్నాము. కలలో చూచిన పదార్థాన్ని మేల్కొని చూచిన తరువాత అసత్యమని తలచినట్లుగా మోక్షాసక్తుడైన విజ్ఞాని తనకు ప్రాప్తించిన సుఖదుఃఖాలన్నీ అశాశ్వతాలని భావిస్తారు, అజ్ఞానియైనవ్యక్తి తన దేహానికి సంబంధించిన కర్మల్ని విడిచిపెట్టడానికి యిష్టపడడు. వనవాసం చేస్తున్నవాడైనా సరే ఇంద్రియాల్ని జయించలేక పోయినట్లయితే సంసారబంధాన్ని తప్పించుకోలేడు. గృహస్థాశ్రమంలో వున్నప్పటికీ జితేంద్రియుడైన వానికి మోక్షం సిద్ధిస్తుంది. శత్రువుల్ని జయించాలని నిశ్చయించినప్పుడు పురుషుడు దుర్గంలోవుండి విరోధుల్ని గెలిచిన విధంగా మోక్షాసక్తుడైనవాడు గృహస్థాశ్రమంలోనేవుంటూ శ్రీహరి పాదపద్మాల నెడి దుర్గాన్ని ఆశ్రయించి కామక్రోధలోభ మోహాలనే అరిషడ్వర్గాన్ని జయిస్తాడు. నీవుకూడ తామరాకుమీద నీరులాగా సంసారంలోనేవుంటూ

దానికి అతీతుడవై భోగాల్ని అనుభవించి మోక్షాన్ని పొందవలసింది.

బ్రహ్మదేవుని మాటల్ని ప్రియవ్రతుడు శిరసావహించి తండ్రి ఆజ్ఞానుసారం గృహస్థుడై రాజ్యాధికారాన్ని స్వీకరించాడు. సింహాసనాన్ని అధిష్ఠించిన -

"ధరణీవల్లభుడా ప్రియవ్రతుడు మోదంబందుచున్ లీల ఈశ్వర వాక్యంబున కర్మతంత్రపరుడై, సంగంబులంబాపు శ్రీ హరిపాదాంబుజ చింతనం దగిలి, నిత్యానందముంబొంది దుర్భర రాగాదుల పారద్రోలి, ప్రజలంబాలించె నత్యున్నతిన్"
(భాగ - 5 - 15)

విశ్వకర్మ కుమార్తె బార్హిష్మతి ప్రియవ్రతుని ధర్మపత్ని - ఆమెవల్ల అతడు అగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహుడు, మహావీరుడు, హిరణ్యరేతుడు, ధృతపృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవి అనే అగ్నిపేర్లు కలిగిన పదిమంది పుత్రుల్ని కన్నాడు. అతనికి మరొక భార్యవల్ల జన్మించిన కుమారులు ఉత్తముడు, తామసుడు, రైవతుడు. వారందరుకూడ ఆత్మవిద్యాసంపన్నులై భగవంతుని పాదపద్మాలమీదనే తమ మనసుల్ని లగ్నంచేసి ధ్యానిస్తూ వుండడంవల్ల వారి అంతఃకరణాలు పరమపవిత్రాలుగా రూపొందాయి.

ప్రియవ్రతునికి బార్హిష్మతిమీద అపారమైన ప్రేమ. అతనికి ఆమెతోడిదే లోకం. అయినప్పటికీ ఆ మహారాజు తన విధులపట్ల ప్రమత్తుడు కాలేదు.

సూర్యుడు భూమండలానికి వెలుతురు ప్రసాదిస్తున్నాడు. కాని అతడు ఏకకాలంలో సమస్త ప్రపంచానికి వెలుగు నివ్వలేడు. కారణం అతని రథం మేరువును చుట్టి వస్తూ వుండడంవల్ల సూర్యునికిముందు భాగంలో వెలుగూ, వెనుక భాగంలో చీకటీ నిండివుంటాయి. అందుచేతనే మనకు రాత్రింపవళ్ళు ఏర్పడుతూ వుండటం జరుగుతూవుంది. ప్రియ వ్రతునికి ఈ విధానం నచ్చలేదు. అర్ధ ప్రపంచం చీకట్లో మునిగివుండటం దేనికని అతడాలోచించి, సూర్యుని రథం లాంటి జ్యోతిర్మయమైన రథాన్ని అధిరోహించి రెండవ సూర్యుని విధంగా ప్రకాశిస్తూ ఆదిత్యునివెంట బయల్దు దేరాడు. సూర్యుడు పడమటి కొండను చేరేసమయానికి ప్రియవ్రతుడు తూరుపుకొండనూ, సూర్యుడు ఉదయాద్రిని చేరే సమయానికి అస్తాద్రిని చేరేవాడు. అందుచేత సమస్త ప్రపంచమూ వెలుగుతో నిండిపోయింది. చీకటి అనేదొకటి వున్నదనే విషయాన్నే ప్రపంచం మరచిపోయింది. అయితే ఈ విధంగా ప్రియవ్రతుడు ఏడుమార్లు మేరువునుచుట్టి అపర సూర్యునివలె వెలుగొందడం సృష్టికి విరుద్ధమని బ్రహ్మ అతని ప్రయత్నాన్ని వారించాడు.

ప్రియవ్రతుడు మేరుపర్వత ప్రదక్షిణాన్ని ఏడుమార్లు చేయడంచేత అతని రథచక్రాలు కారణంగా ఏడు గుంత లేర్పడి సప్తసముద్రాలుగా రూపొందాయి. అవి 1. లవణ, 2. ఇక్షు, 3. మద్య, 4, ఘృత, 5. క్షీర, 6. దధి, 7. నీర సముద్రాలు. అదేరీతిగా జంబు ప్లక్ష శాల్మలి కుశ క్రౌంచ శాక పుష్కరాలనే పేరుతో సప్తద్వీపాలు సైతం ఏర్పడ్డాయి. ప్రియవ్రతుడు తన కుమారులైన అగ్నీధ్రాదులు ఏడుగురిని వరుసగా ఈ ద్వీపాలకు రాజుల్ని చేశాడు. మిగిలిన వారికి తన రాజ్యాన్ని పంచియిచ్చి, రాజ్యలక్ష్మిని మృతదేహం లాగా విసర్జించి, నారదుడు చూపిన మార్గంలో మోక్షాన్ని పొందాడు. ప్రియవ్రతునివంటి భాగవతోత్తముడూ, ప్రజా పరిపాలకుడూ సమస్త జగతికి ఆదర్శప్రాయుడు. రెండవ సూర్యుడై ఆ మహారాజు చేసిన ఘనకార్యాన్ని భగవంతుడు తప్ప ఇతరులెవరు చేయగలరు?— (భా. పంచమస్కంధం)

— డి. నాగసిద్దారెడ్డి, తిరుపతి.

ప్రపంచం నన్ను గురించి యేవి అనుకొంటూ వుంది అని తెలుసుకొనే దానికి బదులు భగవంతుని దృష్టిలో నేను యెట్లున్నాననే విషయం గుర్తులో పెట్టుకోవాలె.

— శ్రీ గురుదేవులు.

ఓం శ్రీ గణేశాయనమః

దేవర్షి నారద చరిత్రము

రచన :

కె. సుబ్బారెడ్డి - బెంగుళూరు.

4-వ అధ్యాయము

నారదుడు - సంకటమోచనుడు

నారదుని ప్రధాన గుణములలో అన్యుల చిత్తవృత్తి నెరిగి వారిని రంజింపజేయుట ఒకటని మనమింతకు ముందే ఎరిగిఉన్నాము. సంకటములో నున్నవారిని వెంటనేచేరి వారి సంకటాన్ని నివారించి వారికి సాంత్వనము కలిగించే సౌశీల్యము నారదమహర్షిలో గలదు. నారదుడు సంకటములో నున్నవారిని ఎందరినో ఆదుకొన్నట్లు అనేకములైన కథలు గలవు. మచ్చుకై ఇచట రెండు కథలు చెప్పబడినవి.

1. పుత్రశోకార్తుడగు సృంజయుడను రాజునోదార్చి అతని పుత్రుని బ్రతికించుట.

పూర్వమొకప్పుడు నారదమహర్షి తనమేనల్లుడ (సోదరి పుత్రుడ) గు పర్వతమునితో గలసి భూలోక సంచారమునకు బయలుదేరెను. నారదునివలె పర్వతుడు కూడా మహాతపస్సంపన్నుడు. వారిద్దరు భూలోకములో సంచరించుచూ వర్షాకాల సమయానికి (చతుర్మాస కాలానికి) శ్వైతుని పుత్రుడగు సృంజయమహారాజు గృహమును చేరిరి. సృంజయుడు ఉదారుడు సువ్రతశీలుడు. మునులిద్దరు వర్షా

కాలము ముగిసేవరకు రాజగృహములో ఉండదలచినట్లు, తెలిపి అందుకై తగిన సదుపాయాలను తమకు కలిగించమని రాజునుకోరిరి. వారి కోర్కెనువిని రాజు కడుముదితుడై వారికి ఉచితమగు సౌకర్యాలను, సత్కారాలను ఏర్పాటు చేసెను. రాజుచేసిన సేవలకు సంతుష్టుడై వర్షాకాలాంతమందు అచటి నుండి పోవునపుడు మునులు అతనికి తగిన ప్రతిఫలమివ్వదలచిరి. అపుడు నారదునిసమ్మతితో పర్వతుడు రాజుకిట్లు చెప్పెను.

"ఓ వరశ్రేష్ఠా! నీవు మాకుచేసిన సత్కారాలకు మాయెడ నీవు చూపిన ప్రీతికి మేము సంతుష్టులమైతిమి - అందుకు ప్రతిఫలంగా నీకొక వరమివ్వదలచినాము. నీకోర్కె యేమిటో యోచించి మాకు తెలుపుము." అందుకు సమాధానంగా రాజిట్లుపలికెను. "ఓ మహాత్ములారా! నాసేవతో మీరు సుప్రీతులై నారని విన్నంతనే నేను కృతార్థుడనైనట్లు భావించుచున్నాను. మీరు సుప్రీతులౌటే నాకు గొప్పవరదానము అదే మహా ఫలదాయకము." ఇట్లు చెప్పి రాజు మిన్నకుండెను. అంత పర్వతుడు తన తపఃప్రభావముతో రాజు మనోగతమగు కోర్కెనెరిగి, "రాజా! నీ మనస్సులో చాలా కాలమునుండి ఒకతీరనికోర్కెగలదు. దానిని పూర్తి చేసుకొనుటకై వరమును కోరుము. దాని నీడేర్చుటకై మేము సిద్ధముగా నున్నాము" అని చెప్పెను. అంతవరకు రాజుకు పుత్రసంతతి లేదు. అందువలన అతని మనస్సులో

మహాపరాక్రమి, భాగ్యశాలి, ఇంద్రునివంటి తేజశ్శాలి యగు పుత్రుని పడయవలెనను కోర్కె ఉండుట నిజమే. అపుడతడు పర్వతముని నిట్లు ప్రార్థించెను.

శ్లో॥ అభీప్సామి సుతం వీరం వీరవంతం దృఢవ్రతం ।
ఆయుష్మంతం మహాభాగం దేవరాజసమద్యుతిం ॥
(మ. భా. శా. ప. 3 అ. 15 శ్లో.)

'భగవన్ ! వీరుడు బలిష్ఠుడు దృఢవ్రతుడు ఆయుష్మంతుడు, భాగ్యవంతుడు తేజములో దేవరాజసముడగు పుత్రుని పొందవలెనని కోర్కె నాకు గలదు.'

ఆ కోర్కెను విని పర్వతుడిట్లు చెప్పెను. "ఓ రాజా! నీవు కోరిన లక్షణాలు గల పుత్రుడు నీకు పుట్టును. అతడు 'సువర్ణష్ఠీవి' (సువర్ణము ఉమ్మిగా గలవాడు) అను పేరుతో ప్రఖ్యాతుడగును. అయితే దీర్ఘాయుష్కుడు కాజాలడు. నీవతనిని దేవరాజు నుండి రక్షించుకోవలసివున్నది." తనకు కలుగబోవు పుత్రుడు అల్పాయువు గలవాడని తెలిసి రాజు వెరగుపడి తన తపః ప్రభావముతో అతనిని దీర్ఘాయుష్కునిగా చేయమని పర్వతమునిని ప్రార్థించెను. అతడు ఇంద్రుని ఆగ్రహానికి వెరచి దానికి సమాధానమివ్వలేదు. అపుడు జాలిగుండె గల నారదమహర్షి సృంజయునికిట్లు చెప్పెను.

"ఓ రాజా ! నీకీవిషయములో సంకటము సంభవించినపుడు నన్ను స్మరించుము. అపుడు నేను వచ్చి మృత్యు

లోకానికి పోయి నీ పుత్రుని తెచ్చి నీకప్పగిస్తాను. ఆ అభయ వాక్కును విని సృంజయుడు సంతసించెను. మునులతని సెలవుపుచ్చుకొని వెడలిపోయిరి.

కొంతకాలానికి మునుల వరము ప్రకారము రాజుకు తేజస్వీ దృఢకాయుడగు పుత్రుడు కలిగెను. అతడు శుక్ల పక్ష చంద్రునివలె దినదినము వృద్ధిపొందుచుండెను. అతని ఉమ్మి (లాలాజలము) బంగారమగుట వాస్తవమే. అతనికి సువర్ణష్ఠీవి అని నామకరణము చేసిరి. ఈ వార్త అన్ని లోకాలలో వ్యాపించి ఇంద్రుని చెవిసోకెను. ఆ బాలకుని వల్ల తన బదవికేమి ఉపద్రవము వచ్చునో అని భీతిల్లి ఇంద్రుడతనిని చంపించ నిశ్చయించెను. వ్యాఘ్రరూపము దాల్చి ఆ బాలకుని హంతమొందించమని, తన వజ్రాయుధానికి ఆదేశించెను. పుత్రోత్సాహముతో రాజపుడు తన భార్యా పుత్రుడు దాసీజనముతో అరణ్యమందు విహరించుచుండెను.

ఇంద్రుని ఆజ్ఞప్రకారము వజ్రాయుధము వ్యాఘ్ర రూపమును ధరించివచ్చి, సమయానికై వేచి రాజురాణి సమీపములో లేనపుడు ఆ బాలకుని కరచి చంపెను. అది చూచిన దాది కేకలువేసి విలపించసాగెను. ఆ కేకలు విని రాజు అచటికివచ్చి, మృతుడైన బాలుని రక్తసిక్తమగు తనువును తన వడిలోబెట్టుకొని శోకింపసాగెను. అపుడు రాణీకూడా అచటికివచ్చి విలపింపసాగెను.

అపుడు నారదుడిచ్చిన వాగ్దానము రాజుకు జ్ఞప్తికి వచ్చెను. అతడు నారదుని స్మరించగా ఋషి వెంటనే అచట ప్రత్యక్షమై, జరిగిన దురంతానికి సంతాపమును దెలుపుచు, రాజుకు పుత్ర శోకోపశమనము చేయుటకై ప్రయత్నించెను. మాంధాతా, పృథువు, యయాతి ఇత్యాది పరాక్రమశాలురు యశోవిశాలురగు పదునారుమంది చక్రవర్తుల కథలను రాజుకు వినిపించి ఇట్లు చెప్పెను, ఓ రాజా! అంతటి గొప్ప చక్రవర్తులే మృతికాహుతులైరి. వారికంటే నీ పుత్రుడు గొప్పవాడు కాదుగదా! కావున నీవు శోకముడుగుము, మృత్యువు కాలగతి ప్రభావము. దానిని నివారించుటకుగాని, తొలగించుటకుగాని ఎవరికీ శక్యముగాదు. దీనిని గుర్తించి నీవు వృథా విలాపముడుగుము. శాంతించుము! అని బోధించెను. కాని ఋషిబోధ రాజుకు శాంతి నొసగజాలక పోయెను. అతడు నారదమహర్షినిట్లు ప్రార్థించెను. "ఓ మహాత్మా! మీరు మహా తపోధనులు. మీ తపః ప్రభావముతో నా పుత్రుని పునర్జీవితునిచేయ సమర్థులు. నన్ననుగ్రహించి నా పుత్రుని పునర్జీవితుని చేయండి." ఆ ప్రార్థనను విని నారదుని మనసు కరిగెను, ఇంద్రుని అనుమతిపొంది ఆ బాలకుని పునర్జీవితుని చేసెను. దానితో రాజదంపతులు అమితానందమునంది, ఋషిచరణములకడ ప్రణమిల్లి తమకృతజ్ఞతలను తెల్పిరి. ఈ రీతిగా నారద మహర్షి సృంజయుని సంకటమును బాపెను.

సువర్ణష్ఠీవి పెద్దవాడై తండ్రి తరువాత రాజ్యాభిషిక్తుడయ్యెను. పరాక్రమముతో రాజ్యాన్ని ధర్మయుతంగా పాలించి, పెక్కు యజ్ఞాలుచేసి దేవతలను తృప్తులను జేసెను. పుత్రవంతుడయ్యెను. ఇట్లు వేయేండ్లు రాజ్యాన్ని పాలించి విశాలయశమును గడించి స్వర్గస్థుడయ్యెను.

(ఈ కథ భారతాంతర్గతము - జ్ఞాతివధకై శోకించు యుధిష్ఠరునికి సాంత్వనము కలిగించుటకై నారదుడే స్వయంగా చెప్పినది.)

ఓమ్

పరంజ్యోతి

రచన - బ్రహ్మచారి విష్ణుదేవానంద
(నారాయణ ధ్యానకుటీరము)

(గత సంచిక 48 వ పేజి తరువాయి)

"తమసోమా జ్యోతిర్గమయ" మన భారతీయ సాంప్రదాయంలో ప్రతి శుభకార్యాన్ని జ్యోతిని వెలిగించడముతో ప్రారంభిస్తాము. తేజః స్వరూపులైన అగ్ని, సూర్య, చంద్రాదుల ఉపాస్తన వేదోక్తమై ఆచరింపబడుతూ వుంది. జీవన వ్యవహారానికి వెలుగు అవసరము. వెలుగే జీవనము. వెలుగులోనే వస్తువులను గుర్తించుట, వ్యవహరించుట జరుగుతుంది. వెలుగు లేకపోతే ఏమియూ లేదు.

చీకట్లో వున్నవాడికి దీపమే వెలుగు. అజ్ఞానాంధకారంలో వుండేవారికి జ్ఞానమే వెలుగు. అందుకే వేదకాలపు ఋషులు "తమసోమా జ్యోతిర్గమయ" అంటూ ప్రార్థించారు.

దేనివలన అన్నివస్తువులు ప్రకాశింపబడి, ప్రకటమవుతున్నాయో అదేజ్యోతి. అలాంటి జ్యోతులకు జ్యోతియై యున్న పరమప్రకాశ, చిత్ స్వరూపమే "పరంజ్యోతి" "జ్యోతిషామపి తద్ జ్యోతిః తమసః పరముచ్యతే (గీ. అ. శ్లో॥ 13-17)" అదే ఆత్మజ్యోతి, అదే పరమాత్మ. ఈ విషయాన్ని శంకరులవారు తమ 'ఏక శ్లోకీ' లో నిరూపించారు.

"కిం జ్యోతిస్తవ భానుమానహని మే రాత్రౌ ప్రదీపాదికం
స్యాదేవం రవిదీపదర్శనవిధౌ కిం జ్యోతిరాఖ్యాహి మే।
చక్షుస్తస్య నిమీలనాది సమయే కిం ధీర్ధియోఽదర్శనే
కిం తత్రాహమతో భవాన్ "పరమకం జ్యోతిః"
తదస్మి ప్రభో॥

ఒక జిజ్ఞాసువు శంకరులవారిని సమీపించి తనకు ఆత్మజ్ఞానాన్ని కలిగించమని కోరితే శంకరులవారు అతనికి కొన్ని ప్రశ్నలు వేశారు. వారి ప్రశ్నలు, అతని సమాధానాలు ఈ ఒకేశ్లోకంలో ఛందోబద్ధం చేయబడినాయి.

శంకరులు — అయ్యా ? నీకు ఏది వెలుగు ? (ఏ వెలుగులో వస్తువులను తెలుసుకొంటున్నావు ?)

జిజ్ఞాసువు — స్వామీ ! పగటియందు సూర్యుడే నాకు వెలుగు.

శం — రాత్రుళ్ళలో ?

జి – దీపాదులు.

శం – సూర్యుడు, దీపాదులు - ఇవేవియు లేనప్పుడు ?

జి – కన్ను (నేత్రాది ఇంద్రియములు)

శం – కళ్ళుమూసికొన్నప్పుడు నీవు కొన్ని విషయాలను తెలుసుకొంటున్నావు గదా! వాటిని ఏ వెలుగులో తెలుసుకొంటున్నావు ?

జి – బుద్ధితో తెలుసుకొంటున్నాను.

శం – బుద్ధియూ లేనప్పటి విషయాన్ని తెలుసుకొనేందుకు నీకు ఏది వెలుగు ? నిద్ర, మూర్ఛ స్థితులలో బుద్ధిలేదు గదా! మేలుకొన్న తర్వాత నేను సుఖంగా నిద్రించి యుంటిని, నేను మూర్ఛితుడినై యుంటిని. నాకేదియూ తెలియలేదు - అని చెప్పుచున్నావే, అప్పటి బుద్ధి యొక్క అభావమును, సుఖమును, అజ్ఞానమును ఏ వెలుగులో తెలుసుకొన్నావు ?

జి – స్వామీ ! అక్కడ నేనే వుండి స్వయంగా (నేరుగా) తెలుసుకొన్నాను.

శం – అయితే అన్నింటిని తెలుసుకొనే - ప్రకాశింప జేసే "ఆ పరమకంజ్యోతి"వే నీవు.

సూర్య చంద్రాదులు లేకున్నను, ఇంద్రియములు లేకున్నను, మనోబుద్ధ్యాదు లేకున్నను, సదా వెలుగుతూ వుండే, సర్వమును ప్రకాశింపజేస్తూవుండే స్వయంప్రకాశ చిద్రూపుడే ఆత్మ. "అలుప్త ప్రకాశత్వం చిద్రూపత్వం"- అది ఎప్పటికీ లోపించునది కాదు.

దీని ప్రకాశంతోనే మిగతా అన్నిజ్యోతులు ప్రకాశిస్తున్నాయి. ప్రకాశింప జేస్తున్నాయి. 'తమేవ భాంత - మనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి।'' సూర్యుని వెలుగులోనే వుండి ఒక అద్దము ఇంటిలోనికి సూర్యకాంతిని ప్రసరింపజేస్తూ వుండునట్లు ఈ బుద్ధి; ఇంద్రియాలు, సూర్య, చంద్ర, అగ్ని ఇత్యాదులు ఆ ఆత్మ సూర్యుని ప్రకాశంలోనే తాము ప్రకాశింపబడుతూ ఇతరములను ప్రకాశింపజేస్తున్నాయి.

సినిమా తెరమీద మనకు కనిపించే సూర్య, చంద్ర దీపాదులకు 'ప్రొజెక్టరు ల్యాంపే' వెలుగును ప్రసాదిస్తూ వున్నట్లు సూర్య చంద్రాదులకు, పరమాత్ముడే వెలుగును ప్రసాదిస్తున్నాడు.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలం ।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం ॥
(గీ॥ 15-12)

జగత్తునంత ప్రకాశింపజేస్తూ వుండే - సూర్యునిలోని తేజస్సు, చంద్రుడు, అగ్నులలోని తేజస్సు నాదేనంటు భగవంతుడు గీతలో చెప్పియున్నాడు.

తెరమీది సినిమాలోని సూర్య, చంద్ర, దీపాదులను, వాటి వెలుగులో కనిపించే ఇతర వస్తువులను, వాటి అభావంతో సినిమాలో తోచే చీకటిగదులు, గుహలు ఇత్యాది దృశ్యములను ప్రొజెక్టరులో వుండే దీపపు వెలుగులోనే చూస్తున్నాము. చీకటిని, వెలుగును, జ్ఞానమును, అజ్ఞానమును

భావమును, అభావమును ప్రకాశింపజేయునదే ఆ పరమ ప్రకాశము.

ఒకడు ఒక మహాత్మునివద్దకు వచ్చి, "స్వామీ! నేను అజ్ఞానిని. నా అజ్ఞానాన్ని దూరంచేయండి" అని ప్రార్థించాడు, అందుకామహాత్ముడు, "అయ్యా! నీ అజ్ఞానాన్ని ఏ జ్ఞానముతో తెలుసుకొన్నావో, ఆ జ్ఞానము నీకుంది. నీవు అజ్ఞానివెలా అవుతావు? జ్ఞాన స్వరూపుడివే పొమ్మన్నాడు.

జాగ్రదవస్థలోని సూర్యచంద్రాదులు స్వప్నావస్థలో లేరు. స్వప్నములోనివి జాగ్రత్తలో లేవు. ఈ రెండు అవస్థలలోని భాస్య భాసకములు సుషుప్త్యవస్థలో లేవు. అయితే మూడవస్థలను ప్రకాశింపజేసే పరమప్రకాశము ఒకటుంది. అది లేకపోతే ఈ అవస్థలన్నీ ఎలా తెలుస్తాయి.

ఒకసారి ఒక ఎగ్జిబిషన్‌లో ఒక పందెము ఏర్పరచినారు. ఒక గదిలో కొన్ని వస్తువులను వుంచి (గడియారము, టేబుల్, రేడియో, గ్లాసు, చెంబు, కుర్చీ మొదలైనవి) ఒక్కొక్క వ్యక్తికి కళ్ళకు గంతలుకట్టి అందులోనికి వదలి 30 సెకండ్లు మాత్రము గంతలువిప్పి మరలా కట్టేసేవారు. ఆ 30 సెకన్లలో వారు చూచిన వస్తువుల నన్నింటిని లిస్ట్ వ్రాయాలి. బయటికి వచ్చినతర్వాత, ఎవరు ఆ వస్తువుల పేర్లను పూర్తిగా వ్రాస్తారో వారికి, అథవా ఎక్కువ వ్రాసిన వారికి ప్రథమ బహుమానము. చాలామంది ఆ వస్తువుల పేర్లను పూర్తిగా వ్రాసినారు. బహుమానం ఎవ్వరికి ఇవ్వాలో అర్థం కాలేదు. అందులో ఒకడుమాత్రం అన్ని వస్తువుల పేర్లనూ వ్రాస్తూ అన్నిటికంటే పైన ఆ గదిలో

"వెలుతురు" వుండిందని వ్రాశాడు. వానికి ప్రథమ బహుమానం వచ్చింది. వెలుతురే లేకపోతే ఏ వస్తువైనా ఎలా కనిపిస్తుంది. అందువల్ల అన్ని అవస్థలు ఏ పరమప్రకాశంలో కనిపిస్తున్నాయో దానినే ఆత్మ లేదా బ్రహ్మ అంటారు.

"యత్ స్వప్న జాగర సుషుప్తమవైతినిత్యం
తద్ బ్రహ్మ నిష్కళమహం న చ భూతసంఘః ॥ "
(ప్రాతః స్మరణ)

"జో సుఖ నిత్యప్రకాశ...సోమైశుద్ధ అపార్ "
(విచారసాగరం)

"జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది ప్రపంచం యత్ ప్రకాశతే।
తద్ బ్రహ్మోహమితి జ్ఞాత్వా సర్వ బంధైః ప్రముచ్యతే॥"

(కైవల్య) - అవస్థాత్రయములను ప్రకాశింపజేస్తూ వుండే ఆ బ్రహ్మమే తానని ఎరింగిన యెడల సర్వబంధముల నుండి విముక్తుడగును.

మరొక ముఖ్యవిషయాన్ని గమనించండి. సూర్యుడు ప్రకాశింపజేసే వస్తువులు సూర్యునికంటె భిన్నముగా వున్నాయి; అవి సూర్యుడు కాదుగదా! నేత్రాది ఇంద్రియాలు ప్రకాశింపజేసే విషయాలు ఇంద్రియాలకంటె భిన్నము; అవి ఇంద్రియాలు కాదుగదా! మనో బుద్ధ్యాదులచేత ప్రకాశింపబడే ఇంద్రియాలు మనోబుద్ధులు కాక వాటికంటే భిన్నమైయున్నాయి. అదేవిధంగా ఆత్మచేత ప్రకాశింపబడే బుద్ధ్యాదులును ఆత్మ కాజాలదు. దానికంటే భిన్నమేకదా! అంటే అవును. అయితే ఆత్మనువదిలి వాటికి ప్రత్యేకమైన స్వతంత్ర అస్తిత్వంలేదు. మట్టివేరే కుండలు

వేరే. నిజమే అయితే కుండలలోని మట్టిని తీసివేస్తే కుండ ఎక్కడుంటుంది ? బంగారాన్ని తీసివేస్తే ఆభరణముండదు. నీళ్ళను తీసివేస్తే అలవుండదు. అన్నింటికి ఉపాదానమే అది.

''సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన''
''ఈశావాస్య మిదంసర్వం యత్ కించ జగత్యాం జగత్''

ఆ బ్రహ్మవస్తువుకంటే అన్యమైన దేదియు లేదనియు, అదియే ఇదంతా అయి; నానా రూపాలుగా భాసిస్తూ వుందంటూ శ్రుతిమాత చెబుతూవుంది. ఆ లెక్కన చూస్తే అంతా ప్రకాశస్వరూపమే, జ్యోతిర్మయమే అయియుండాలి.

సినిమా తెరమీద మనకు ఎంతోమంది వ్యక్తులు, వస్తువులు, వ్యవహారాలు, చిత్రాలు, విచిత్రాలు కనిపించినా, బాగా విచారించి చూస్తే దానిమీద వెలుగుతప్ప మరే దియూ లేదు. అదికూడ ప్రొజెక్టరులోని దీపపువెలుగే. ఒక్కొక్కచోట దట్టంగాను, పలుచగాను పరచుకొని అనేక రూపాలుగాను, వాటి కదలికలుగాను కనిపిస్తూవుంది. చిత్ర కారుడు ఒకే రంగును ఒక్కొక్కచోట మందముగాను, పలుచగాను వేస్తూ ఆ చిత్రంలో వైవిధ్యాలను, అంగాంగ ముల నిమ్నోన్నతాలను, దూరసామీప్యాలను సృష్టిస్తాడు. ఉన్నదేమో ఒకటే రంగే. అదే విధంగా ఒకే ప్రకాశమే పలు రూపాలుగా కనిపిస్తూవుంది. స్వప్నంలోకూడా స్వప్న సాక్షియొక్క ప్రకాశమే అనేక రూపాలుగా భాసించి మెలు కువ కాగానే విలయమైపోతున్నది. అందులకే స్వప్నాభి మానిని తైజసుడంటారు.

(సశేషం.)

ఓమ్

శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః

సద్గురు శ్రీ శ్రీ శ్రీ గండి రామకృష్ణానందగిరిస్వాములవారి 83 వ (జన్మదిన) జయంతి సందర్భంగా శ్రీవారి పాదపద్మములను స్మరింపుచూ, శ్రీ శ్రీ శ్రీ మాతృమూర్తియగు - మాతాజీవారియొక్క ఆశీర్వాదమును - గోరుచూ మాధన్యవాదములు దెలుపుచూ వ్రాసుకొన్న -

పద్య రత్నములు

క॥ గురువే బ్రహ్మయు విష్ణువు,
గురువే శ్రీ ఈశ్వరుండు గురువేసాక్షాత్,
పరమౌ బ్రహ్మము తస్మై -
గురువున్ శ్రీరామకృష్ణు గూర్మి భజింతున్ ॥

ఉ॥ చిన్నతనంబు నుండి గురుచెంతనుజేరి ప్రసన్నచిత్తుడై
మన్ననలంది సద్గురునిమాధవుకైవడి సేవ జేయుచున్
పన్నుగ బ్రహ్మచర్యమును-పాదుగసల్పియు-సన్యసించియున్
సన్నుతి వొందెనేఘనుడు - సద్గురు గొల్చెద రామకృష్ణునిన్ ॥

చ॥ అపర వివేకనందుడయి - ఆంగ్లత్రిలింగము దేశభాషలన్
విపులముగా నెరింగి అవివేక, తమిస్రముబాప జ్ఞానియై
జపతపయోగ సూత్రములు సాధనజేసి సుబోధ - కంబుగా
నపరినితాంతసక్తుడయి - ఆత్మవిచారముదెల్పె - పూజ్యుడై ॥

శా॥ శ్రీపాపాఘ్నిస్రవంతి తీరమున సుక్షేత్రంబులో - గండిలో
సాపేక్షన్ వసియించి వీరు - తపమున్ సాధించి పెక్కేండ్లుగా
నాపాదింపగ శిష్యకోటికి మహాయాచార్యులై - యోగిరాజై
పాపాలన్ దొలగించి "విష్ణు"పగిదిన్ గాపాడి - రక్షించెగా ॥

క॥ ఇటువంటి గురుని మరువక -
పటుతరముగ బూజసేయ భక్తపరేఖ్యున్
తృటిలో - భక్తియుగల్గును,
మటుమాయంబగు గలుషము మాన్యుల కెల్లన్॥

క॥ శ్రీ సద్గుర్వా - జయంతిని
వాసిగ జరిపించిరి ఎన - బైమూడేటన్
యాశలు దీరగ - గురుకుల
వాసము - శ్రీ గండిక్షేత్ర - వైభవ మొప్పెన్ ॥

క॥ మాతా! ప్రతిభానంద గి
రితల్లికి, నతులొనరింతు - రేయింబవలున్
భూతదయా పరురాలికి
ఖ్యాతి వహించిన, నిరుపమ - కరుణామయికిన్ ॥

శా॥ అంతేవాసిగ నెల్లకార్యములకున్ యధ్యక్షులైయుండి - యే
చింతల్ లేకయే సర్వకార్యములనున్ జేపట్టి సాధింపుచున్
సంతోషంబుగ "గుర్వాకు"న్ సతతంబాపేక్షయారాధనల్
శాంతింజెందగజేయుచున్ గురుని సచ్చారిత్రమున్ జాటెగా ॥

క॥ "శుకవాణికి"యున్ సంపా
దకురాలై, తానొకకొర - తయులేకుండన్
సుకరముగ నడపుచున్నది
అకలంకంబైనరీతి, నాచార్యవలెన్ ॥

ఉ॥ చల్లగ "ఆశ్రమంబు"నను, ఛాత్రులకెల్లను మార్గదర్శివై
చల్లనినీడలో నిలిచి "సద్గురు"దేవుని సేవ జేయుచున్
యేలికవై, కృపాజలధివై, గురుదేవునియాజ్ఞ - మీరకున్
కల్లలులేని జీవితముగా - చరియించితిరమ్మ - జ్ఞానివై ॥

క॥ శతవర్షము లారోగ్యము
నతులితముగ గల్గు మీకు - నచ్యుతు కరుణన్
సతతముగాపాడుచు - శ్రీ
శితికంఠుడు బ్రోచుగాక - చిరకాలముగన్ ॥

తేది 14—7—97.
ధర్మవరము.

ఇట్లు - ప్రార్థించు
శ్రీ సద్గురు - పాదధూళి
షామిశెట్టి - రామదాసు.

ఓం

ఓం నమో భగవతే శ్రీ సద్గురు దేవాయ

శ్రీ సద్గురు మాహాత్మ్యం

"అణోరణీయాన్ – మహతో మహీయాన్"

ప్రియాత్మ శ్రీ సద్గురు భక్తులారా!

శుకవాణీ పాఠకులారా! శ్రీ సద్గురు జయంతి మనందరికి జయం - జయం.

మన శ్రీ సద్గురుదేవులు అణువులో అణువై మహత్తులో మహత్తై సర్వవ్యాపకత్వంతో శక్తిని ప్రసాదిస్తూన్నారు అనుటలో అతిశయోక్తిలేదు.

ఈ మధ్య ఆశ్రమంలో జరిగిన శ్రీ సద్గురు జయంతి సాధన సదస్సు - పై మాటకు నిదర్శనముగా జరిగింది.

ఈశ్వరస్సర్వ భూతానాం - హృద్దేశేఽర్జున తిష్ఠతి।
భ్రామయన్సర్వ భూతాని - యంత్రారూఢాని మాయయా॥

[18 అ॥ 61 శ్లో॥]

అన్న శ్రీ గీతాచార్య శ్రీ కృష్ణపరమాత్ముని మాట త్రిసత్యమనే అనుభూతిని మేము – ఆశ్రమానికి వచ్చిన ప్రతి సాధకులు అనుభవించాము. ఉదాసీనత - సాక్షిత్వం కళ్ళతో చూచినాము - హృదయంతో అనుభవించాము. అర్ధమండలం రోజులు సాధన సదస్సులో ఒక క్షణమైనా పృథాకాకుండా ప్రాతఃకాలము 4 నుండి రాత్రి 9 గం॥ వరకు సర్వకార్యాలు సాగినవి. ఏ ఒక్కరికైనా శ్రమపొందుతున్నట్లుగా గాని - జరిపించుచున్నట్లుగా గాని అని పించలేదంటే శ్రీ సద్గురు అనంతశక్తిబలం తప్ప మరేమీకాదు. జరుగుతూన్న కార్యక్రమం సాక్షిగావుండి ఎవరికి వారం అనుభవించాము. అణువులో అణువుగా మహత్తులో మహత్తుగా శ్రీసద్గురు శక్తిని చూచి అనుభవించి తీరని ఆనందం పొంది తరించాము. అట్టి శ్రీ సద్గురు శక్తిని సదా గుర్తిస్తూ శ్రీ సద్గురుభక్తులు సద్వినియోగం చేసుకొని తరించుదురు గాక! అంటూ సెలవు.

ఓం - మా తా జీ.

శ్రద్ధాంజలి

★

శ్రీ శ్రీ శ్రీ పరమపూజ్యులు శ్రీగురుతుల్యులు. అనంత ప్రేమా భిమాన స్వరూపులు త్యాగసంపన్నులు – నిరాడంబర మూర్తులు– శ్రీ రామకృష్ణమిషన్ సంస్థకు ఎనలేని సేవచేసిన పుణ్యమూర్తులు – శ్రీ రామకృష్ణ పరమహంస పరంపర సంప్రదాయ సంపన్నులు – శ్రీ నందానందస్వాములవారు మే నెల 24-వ తేది సాయం సమ యంలో 6-40 ని॥ సిద్ధి పొందినారని జూన్ 26-వ తేదీ ఈ చెవ్విని పడగానే దిగ్భ్రాంతిచెందాను. ఆ మహానుభావుల దర్శనం – సంభా షణాభాగ్యం 79 సం॥లో జరిగినది. 1980 మహాశివరాత్రి రోజు నా సంన్యాసదీక్షకు ఆహ్వానించగా అంగీకరించి చాలా ప్రేమ వాత్సల్యములు చూపించి వచ్చారు. నన్ను ఎంతో ఆప్యాయతతో ఆశీర్వదించారు.

శ్రీ మా సద్గురు దేవులు సిద్ధిపొందిన వార్త వారికి అందగానే 1993 వ సం॥లో వారి ఆవేదన అందిస్తూ నాకు ధైర్యం కల్గించే అనేక వాక్యాలు వ్రాసి ఆశీర్వదించారు.

ఈ మధ్య 1996 డిసెంబరులో తిరుపతి – శ్రీ మలయాళ సద్గురు సేవాసమాజంలో గీతా జయంతి సుసందర్భంగా వారిని దర్శించే భాగ్యం కల్గింది. చాలా నీరసంగా వుండిరి. అయినా దర్శ నానికి వెళ్ళినప్పుడు ఎన్నో హితోపవచనములు అందించి ఆశీర్వదిం చిన అట్టి అనంత ప్రేమస్వరూపులు లోకంలో దుర్లభం. అట్టి దివ్యమూర్తికి మా హృదయావేదనంతో శ్రద్ధాంజలులు ఘటిస్తూ శ్రీవారి ఆత్మకు శిరసావందనాలు సమర్పించు కొంటూ వారు నా కిచ్చిన అనేక సలహాలు – హితబోధను స్మరిస్తూ హృదయావేదన పుష్పాన్ని అందిస్తూ,

ఓం

మాతా ప్రతిభానందగిరి.

శ్రీ సద్గురు జయంతికి భిక్షకొరకు విరాళము నొసగిన దాతలు

(జూలై సంచిక తరువాత)

శ్రీమతి సి. రామసుబ్బమ్మగారు, W/O సి. బాలగుర్రప్పగారు,
వీరన్నగట్టుపల్లె రశీదు నెం. 72 1100–00

శ్రీ యర్రం పెద్దన్నగారి సంస్మరణార్థం ధర్మపత్నిగారు,
తిమ్మంగారిపల్లె 1000–00

శ్రీమతి ఆర్. స్రవంతి W/O జగదీష్‌రెడ్డి - వేంపల్లె 750–00

శ్రీమతి లక్ష్మిదేవమ్మ W/O ధర్మాచారి - తిరుపతి
రశీదు నెం. 83 500–00

శ్రీమతి ఎ. లక్ష్మమ్మగారు W/O శ్రీ శుభానందస్వామి
ఓబులవారిపల్లె రశీదు నెం. 76 500–00

శ్రీమతి యం. వరలక్ష్మిగారు W/O ఎం. రామస్వామి
గారు, తిరుపతి. 5000–00

శ్రీ మాదరాసు ఆదినారాయణగారు,
శ్రీ యస్. కుసుమకుమారి రశీదు నెం 84 కడప 1016–00

శ్రీ పి. సుబ్బరాయుడుగారు, రశీదు నెం. 85 రాయచోటి 1016–00

శ్రీ ఆర్. సూర్యనారాయణరెడ్డిగారు, రశీదు నెం. 16
లక్కిరెడ్డిపల్లె 500–00

శ్రీ పేర్ల శివారెడ్డిగారు, రశీదు నెం. 18 తాళ్ళపల్లె 500–00

శ్రీ ఎస్. దేవగోపాలుశెట్టిగారు, రశీదు నెం. 30 రాయచోటి 1110–00

శ్రీ మునగా శిద్ధయ్యశెట్టిగారు, „ 33 „ 510–00

శ్రీమతి ఎ. సుభద్రమ్మగారు, సురభి 558–00

శ్రీ యారబాక యశోదమ్మగారు, రశీదు నెం. 41 మానెగుంటపాడు, నెల్లూరు	1000–00
శ్రీమతి యం. లక్ష్మమ్మగారు, W/O యం. పెద్దసుబ్బారెడ్డిగారు, కొత్తపల్లె	1000–00
శ్రీ పి. శంకరరాజాశెట్టిగారు, రశీదు నెం. 48 రాయచోటి	1000–00
శ్రీ చెన్నూరు కొండపేట అధ్యాత్మిక బృందం రశీదు నెం 57 (కడప జిల్లా)	1500–00
శ్రీ సొద్దల లక్ష్మమ్మగారు, సిరిగెపల్లె (కడప జిల్లా)	1000–00
శ్రీ డి. కొండమ్మగారు, సాయిబాబా భక్తులు రశీదు నెం, 53 ప్రొద్దుటూరు	5' 0–00
శ్రీ చల్లా లక్ష్మినారాయణగారు, ,,	1500–00
శ్రీ వి. సీతారామయ్యశెట్టిగారు, రశీదు నెం. 84 కడప	1500–00
శ్రీమతి అమ్మణ్ణమ్మగారు, శ్రీ యడ్లపల్లి గోవిందుశెట్టిగారు, నెల్లూరు	1500–00
శ్రీ పి. కొండారెడ్డిగారు, పులివెందుల	1000–00
శ్రీమతి వాసంతమ్మగారు, రశీదు నెం. 91 పీలేరు	600–00
శ్రీమతి తేజోవతమ్మగారు - కడప	500–00
అంతరంగభక్తులు – (వంకదారి సీతారామయ్యగారి ద్వారా) కడప	1000–00

గమనిక:— 500 రూ॥ నుండి పైన భిక్షకొరకు అని చెప్పి యిచ్చిన దాతల పేర్లు-విరాళం మాత్రం ప్రకటించుట జరిగినది.

ఓం

కార్యదర్శి.

భాగవత పఠనము

(బ్రహ్మచేసిన శ్రీ కృష్ణస్తవము నుండి)

శ్లో॥ తథాపి భూమన్ మహిమా గుణస్యతే
విబోద్ధు మర్హత్య మలాంతరాత్మభిః।
అవిక్రియాత్ స్వానుభవాదరూపతో
హ్యనన్య బోధ్యాత్మతయా న చాన్యథా ॥

(సం. భాగ. 10 స్కం. పూ. భా. 14-6)

భావార్థం:- ఓ పరిపూర్ణా! భక్తిచే పరిశుద్ధాంతఃకరణులగు వారు ప్రకృతిగుణముల కతీతమైన నీ మహిమ నెరుగుట కర్హులగు చున్నారు. ఎట్లంటే, వారు తమ అమలాంతఃకరణములందు నీవు నిర్వికారుడవు, స్వానుభవముతో మాత్రమే ఎరుగదగినవాడవు అని, ప్రత్యగాత్మ పరమాత్మకంటే భిన్నముకాదని ఎరుగ గలుగు చున్నారు. (అపరోక్షానుభూతి నందగలుగుచున్నారు.) వారు ఇత రోపాయాల నెరుగరు. (నీవు భక్తసులభుడవు, అనుభవైకవేద్యు డవు) పోతన పద్యం.

సీ॥ విక్రియాశూన్యమై విషయత్వమును లేని
దగుచు నాత్మాకారమై తనర్చు
నంతఃకరణమొక్క యధిక సాక్షాత్కార
విజ్ఞానమున బట్టి వేఱొరులకు
నెరుగంగరానిదై యేపారియుండు
టంజేసి నీ నిర్గుణ శ్రీవిభూతి
బహిరంగ వీథులబాఱక దిరములై
యమలంబులగు నింద్రియములచేత

ఆ॥ నెట్టకేలకైన నెఱుగంగ నగుగాని
గుణవిలాసి వగుచు గొమరు మిగులు
నీ గుణప్రజంబు నేరరాదెఱుగంగ
నొక్కమితములేక యుంట నీశ.

(తె. భాగ. 10 స్కం. పూ. భా - 553)

News Paper Registration No. 44859/86
SUKAVANI Postal No, H/PD 7

వార్తలు - మాతాజీవారి పర్యటనలు

1. శ్రీ సద్గురు అనుగ్రహంచే శ్రీ మాతాజీవారు సంకల్పించిన శ్రీ సద్గురు జయంతి సాధన సదస్సు అర్ధమండలం మాతాజీవారి ఆధ్వర్యంలో సాంగమంగళంగా జూలై 1 నుండి 20 వ తేదీ వరకు జరిగింది. శ్రీ గురుపూర్ణిమ 20 వ తేది కడప మహిళాసంఘంవారితో ఆనందదాయకంగా 108 మందితో విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణ - హనుమాన్ చాలీసా పారాయణ విశేషంగా జరిగింది.

2. జూలై 24 వ తేది మాతాజీవారు విజయవాడ వెళ్ళి 26 వ తేది విశాఖజిల్లా అనకాపల్లి వారి ఆహ్వానంపై 30 వ వార్షికోత్సవంలో పాల్గొని 28 వ తేది పెద్దాపురం వెళ్ళి 31 శ్రీ విఠల్ బాబాజీవారు చేయుచున్న గీతాజ్ఞాన సప్తాహంలో అనపర్తి వెళ్ళి పెనమలూరు చేరుకొన్నారు.

3. ఆగష్టు 1 నుండి 16 – 17 వరకు పెనమలూరు శ్రీ పరమాత్మానందాశ్రమంలో జరుగు అర్ధ చాతుర్మాస్య వ్రతంలో వుండి మాతాజీవారు 21 – 22 తేదీలకు మాతృస్థానం గండిచేర్తారు. సెప్టెంబర్ 5 - 6 తేదీల వరకు ఆశ్రమంలో వుంటారు.

Published by Matha Prathibhanandagiri Sri Bhoomananda Ashram V. G. Palle, P. O, Cuddapah-Dt. 516 329
Phone Vempalle S. T. D. No. 08562 – 81250.
Printed at Sri Balaji Press, Gandhi Road, Chittoor (A.P.)